ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 2, జూన్ 2025



తూర్పునాయుడుపాలెంలో రేషన్ సరుకులు అందజేస్తున్న మంత్రి స్వామి

పండుగలా రేషన్ పంపిణీ

- చౌక ధరల దుకాణాలు పునఃప్రారంభం
- కొండపి నియోజకవర్గంలో పాల్గొన్న మంత్రి స్వామి
- పలుచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు
- నెలలో 15 రోజులపాటు షాపుల వద్దనే సరుకులు

రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ పునఃప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా ఆదివారం పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ విధానం వల్ల ఐదేళ్లుగా కార్డుదారులు పడ్డ 'బండి'డు కష్టాలు ఇక తీరనున్నాయి. తిరిగి గతంలో వలే దుకాణాల్లో బియ్యం, పంచదార, కందిపప్పు వంటి సరుకులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఈవిధానాన్ని పునఃప్రారంభించింది. - ఒంగోలు, ఆంధ్రజ్యోతి

బియ్యం, పంచదార పంపిణీ

జిల్లాలోని 38 మండలాల్లో 1,392 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా 6.61 లక్షల మంది కార్డుదారులకు ప్రతినెలా 10,391 మెట్రిక్ టన్నుల బియ్యం, 346 టన్నుల పంచదార, 661 టన్నుల కందిపప్పు ఇస్తున్నారు. ఈనెలలో కందిపప్పు మినహా బియ్యం, పంచదార పంపిణీని అన్ని చౌకధరల దుకాణాలలో పునఃప్రారంభించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తూర్పునాయుడుపాలెంతోపాటు కొండపి మండలం కె.ఉప్పలపాడులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తొలిరోజు 11.32 శాతం మందికి సరుకులు

జిల్లావ్యాప్తంగా రేషన్‌షాపుల ద్వారా తొలిరోజు 11.32 శాతం మంది కార్డుదారులకు సరుకులను పంపిణీ చేశారు. జిల్లాలో 6,61,206 కార్డులు ఉండగా ఆదివారం 72,005 మంది రేషన్ తీసుకున్నారు. బేస్తవారపేట మండలంలో అత్యధికంగా 18.33శాతం మంది కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయగా, మద్దిపాడు మండలంలో అత్యల్పంగా కేవలం 5.37శాతం మందికి మాత్రమే రేషన్ అందింది. సోమ, మంగళవారాల్లో పూర్తి స్థాయిలో పంపిణీ జరగనుంది.

ఒంగోలులో పాల్గొన్న పౌరసరఫరాల సంస్థ ఎండీ



ఒంగోలులో రేషన్ దుకాణాన్ని ప్రారంభించి బియ్యం పంపిణీ చేస్తున్న పౌరసరఫరాల సంస్థ ఎండీ జిలానీసమూన్

రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ఎండీ జిలానీసమూన్ ఒంగోలులోని సంతపేటలో మేయర్ సుజాతతో కలిసి రేషన్ షాపును ప్రారంభించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఏడుగుండ్లపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి పట్టణంలో రేషన్ పంపిణీ చేశారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పట్టణంలోని ఎంఎస్ఆర్ కాలేజీ ప్రాంతంలోని దుకాణంలో పంపిణీని ప్రారంభించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని 27వ వార్డు, దరిమడుగు, సీతానాగులవరం గ్రామాల్లో పాల్గొన్నారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు వైపాలెంలో, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు దర్శిలో ప్రారంభించారు. ఇతర చోట్ల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా దుకాణాలు ప్రతినెలా 1నుంచి 15వతేదీ వరకు ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనిచేస్తాయని ప్రభుత్వం ప్రకటించింది.

వైసీపీ ఐదేళ్ల పాలన 'అవినీతికి కాదేదీ అనర్హం' అన్నట్లు సాగింది. అధికారులు, ఆ పార్టీ నేతలు కుమ్మక్కై దోపిడీ పర్వాన్ని కొనసాగించారు. 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో కిరికిరి చేశారు. జగనన్న లేఅవుట్ల మాటున రూ.కోట్లు కొల్లగొట్టారు. భూముల కొనుగోళ్లు, చదును పేరుతో మాయ చేశారు. ఇక భూముల ఫ్రీహోల్డ్‌కు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఆసరా చేసుకొని పేదల పొట్టగొట్టి వేలాది ఎకరాలను ఆపార్టీ పెద్దలు లాగేసుకున్నారు. ఫైబర్ నెట్‌ను పక్కదారి పట్టించారు. ఈ వ్యవహారాలన్నీ ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాల మేరకు అనేక అంశాలపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. కొన్నింటిపై ఇప్పటికే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. వీటిలో విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. -ఒంగోలు క్రైం, ఆంధ్రజ్యోతి



దోచేశారు!

గత ప్రభుత్వంలో అన్నింటా విచ్చలవిడిగా అవినీతి

- అధికారులు, వైసీపీ నేతల స్వాహాపర్వం
- జగనన్న లేఅవుట్‌ల పేరుతో నిధుల గోల్‌మాల్
- ఫ్రీహోల్డ్‌తో భూములను లాగేసుకున్నారు!
- ఫైబర్ నెట్ పరికరాల్లోనూ దుర్వినియోగం
- 'ఆడుదాం ఆంధ్ర'లో అవకతవకలు బహిర్గతం
- విజిలెన్స్ విచారణలో ఒక్కొక్కటిగా వెలుగులోకి..
- ప్రభుత్వానికి నివేదికలు అందించిన అధికారులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ పథకాలు, కార్యక్రమాల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ దృష్టి సారించింది. 'ఆడుదాం ఆంధ్ర'లో చోటుచేసుకున్న అక్రమాలపై గురిపెట్టింది. 2023 డిసెంబర్ 26 నుంచి 2024 ఫిబ్రవరి 6 వరకు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో

ఆటలో అవకతవకలు

ఐదు అంచెలుగా క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాకారుల నుంచి స్పందన లేకపోవడంతో వైసీపీ నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు కలిసి తూతూమంత్రంగా పోటీలు పెట్టి మమ అనిపించారు. అయితే వీటి పేరుతో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విజిలెన్స్ అధికారులు సమగ్రంగా విచారణ చేస్తున్నారు. జిల్లాలోని 38 మండలాల నుంచి సమాచారం తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా మండలాల అభివృద్ధి అధికారులకు లేఖలు రాశారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల వివరాలు, ఖర్చు చేసిన మొత్తం, ఎవరికి బహుమతులు అందజేశారు అన్న అంశాలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

జగనన్న లేఅవుట్లపై ఇప్పటికే నివేదికలు

వైసీపీ పాలనలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో అంతులేని అవినీతి చోటుచేసుకుంది. భూముల చదును పేరుతో రూ.లక్షలు కొల్లగొట్టినట్లు అప్పట్లో ప్రచారం నడిచింది. వీటన్నింటిపై ఇప్పుడు విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. జిల్లాలో ఎన్ని గ్రామాల్లో జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేశారు? అందుకోసం అవసరమైన భూములను ఎవరి వద్ద కొనుగోలు చేశారు? ప్రైవేటు వ్యక్తుల వద్ద భూములను మార్కెట్ ధరకంటే అధిక రేటుకు కొనుగోలు చేశారా? అన్న విషయాలను లోతుగా పరిశీలించారు. ఆరోపణలన్నీ వాస్తవాలని తేలడంతో ప్రభుత్వానికి నివేదికలు పంపించినట్లు తెలిసింది.

ఫ్రీహోల్డ్ భూముల్లో అవకతవకలు



22 (ఏ) లో ఉన్న అసైన్‌మెంట్ భూములను గత ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేసి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించింది. దీన్ని ఉపయోగించుకుని వైసీపీ నాయకులు భూములను చేజిక్కించుకొని లబ్ధిపొందినట్లు ప్రస్తుత ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు వెళ్లాయి. గతంలో క్రయవిక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్లు పూర్తయిన భూములపై విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అధికారులు ఆ భూముల రిజిస్ట్రేషన్‌లను పరిశీలించి అక్రమాలపై ప్రభుత్వానికి నివేదికను పంపినట్లు తెలుస్తోంది.

ఫైబర్ నెట్‌లో అక్రమాలపై ఆరా



ఫైబర్ నెట్‌లో అక్రమాలపై ఇప్పటికే విజిలెన్స్ అధికారులు విచారణ పూర్తి చేశారు. అసలు ఫైబర్ నెట్‌కు ఎన్ని కనెక్షన్‌లు ఉన్నాయి? వాటిని పెంచారా? ప్రభుత్వం నుంచి వచ్చిన పరికరాలు సక్రమంగా వినియోగించారా? అన్న కోణంలో విచారించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపించిన పరికరాల పక్కదారి, దుర్వినియోగంపై కూడా విచారించారు. వీటిలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారని తెలుస్తోంది.

ముప్పా చుట్టూ ఉచ్చు

- ఆయన బంధువులకు పోలీసుల నోటీసులు
- సురేష్ కంపెనీలో డైరెక్టర్ ద్వారా నగదు బదిలీ అయినట్లు నిర్ధారించిన పోలీసులు
- వీరయ్య హంతకులను గుర్తించిన సాక్షులు



వీరయ్య చౌదరి హత్య ప్రదేశంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

ఒంగోలు క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో సూత్రధారిగా ఉన్న ముప్పా సురేష్ చుట్టూ పోలీసులు ఉచ్చు బిగిస్తున్నారు. ఆయన్ను అరెస్టు చేసేందుకు ఒకవైపు ముమ్మరంగా గాలిస్తున్నారు. మరోవైపు సురేష్ పాస్‌పోర్టును ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఆయన బంధువులు, స్నేహితులకు సైతం నోటీసులు ఇచ్చారు. వారిని ఒంగోలు డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి విచారణ చేస్తున్నారు. ఇదేక్రమంలో హత్యకు సంబంధించిన కీలక ఆధారాలను కూడా పోలీసులు సేకరించారు. ముప్పా సురేష్ కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి ద్వారా కిరాయి హత్యకు సుపారీ మాట్లాడుకున్న వినోద్‌కు కొంత మొత్తంలో నగదు బదిలీ అయినట్లు గుర్తించారు. హత్యకు కొన్ని నెలలు ముందు ఇది జరిగినట్లు ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. అదే సమయంలో సురేష్‌కు ముందస్తు బెయిల్ రాకుండా కోర్టుకు నివేదికలు అందజేసినట్లు సమాచారం.

నిందితులను గుర్తించిన సాక్షులు

వీరయ్య చౌదరిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన సమయంలో ఆయన కార్యాలయంలో నలుగురు సిబ్బంది ఉన్నారు. వారే ఈ కేసులో సాక్షులు. నిందితులను గుర్తించేందుకు గతనెల 29న జిల్లా జైలులో న్యాయమూర్తి సమక్షంలో ఐడెంటిఫికేషన్ పరేడ్ నిర్వహించారు. సాక్షుల ఎదుట వీరయ్య హత్యలో ప్రత్యక్షంగా పాల్గొని ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులతోపాటు, కొంత మంది ఖైదీలను హాజరుపర్చారు. వారిలో ముగ్గురు నిందితులను సాక్షులు గుర్తించినట్లు తెలిసింది.



పోతురాజు కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆధునికీకరణం

- ఒంగోలులోని పోతురాజు కాలువ పూడికతీత పనులపై శాఖల మధ్య లోపించిన సమన్వయం
- కలిసి రాని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- మురుగు సమస్య కావడంతో కార్పొరేషన్‌కు తిప్పలు

7

వెన్నుపోటు దినం కాదు.. వైసీపీ తద్దినం చేసుకోండి

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

వివరాలు మెయిన్‌లో..



1100 ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాల్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది 1100 నంబర్‌తో పనిచేస్తుందన్నారు. అర్జీదారులు ఈనంబర్‌కు డయల్ చేసి తమ సమస్యను విన్నవిస్తే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి సంబంధిత అధికారికి పంపుతారన్నారు. సదరు అధికారి ఆ సమస్యను పరిష్కరించడంతోపాటు అర్జీదారుడి మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా నిర్ధారణ సమాచారాన్ని పంపిస్తారని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సివిల్స్‌లో ర్యాంక్ సాధించడం గొప్ప విజయం

అన్ను కౌశిక్ అభినందన సభలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

7

వైద్యశాఖలో బదిలీలకు

గ్రీన్ సిగ్నల్



- స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు
- 19లోపు ప్రక్రియ పూర్తికి ఆదేశం
- ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన ఉద్యోగులందరికీ స్థానచలనం

వైద్యశాఖ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు ఇచ్చారు. మార్గదర్శకాలను జారీ చేశారు. ఈనెల 19లోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యశాఖ ఉద్యోగులు కొన్నేళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఆ శాఖలో కోలాహలం నెలకొంది.

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వైద్యశాఖలోని అన్ని కేడర్ల వారు ఐదేళ్ల కంటే ఎక్కువ కాలం ఒకేచోట పనిచేస్తుంటే వారిని తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. 2025 మే 21వతేదీ నాటికి ఒకే ప్రాంతంలో రెండేళ్ల సర్వీసు పూర్తిచేసిన ఉద్యోగులు మాత్రం అభ్యర్థన బదిలీలకు అర్హులు. ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఒకే ప్రాంతంలో పనిచేస్తూ వారిపై ఏసీబీ/విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉంటే నాన్-ఫోకల్ పోస్టుల్లో నియమించనున్నారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లు ఒక నిర్దిష్ట పరిపాలనా యూనిట్/కార్యాలయంలో 3 నుంచి 9 సంవత్సరాలు పనిచేసి ఉంటే అదే కార్యాలయంలో మరొక యూనిట్‌కు ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమిస్తారు. ఖాళీ లేకపోతే స్టేషన్ బయటకు స్థానచలనం కల్పిస్తారు. ఇతర సిబ్బంది మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు పనిచేసి ఉంటే వారికి అదే కార్యాలయంలో ఖాళీ పోస్టు ఉంటే అందులో నియమించాలి. అక్కడ ఖాళీ లేకపోతే సమీపంలో ఉండే ప్రాంతానికి బదిలీ చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే పలు శాఖల్లో బదిలీల ప్రక్రియ ప్రారంభమై సోమవారంతో ముగియనుంది. వైద్యారోగ్యశాఖలో ఆలస్యంగా ప్రారంభమవుతోంది. ఈనెల 19వతేదీ వరకు బదిలీలకు అవకాశం కల్పించడంతో ఆశాఖ ఉద్యోగుల్లో ఆదివారం నుంచి సందడి నెలకొంది. కొంతమంది ఉద్యోగులు ప్రస్తుతం పనిచేస్తున్న చోటును కాపాడుకునేందుకు పావులు కదుపుతున్నారు. అందుకోసం ప్రజాప్రతినిధులు, గుర్తింపు పొందిన సంఘాల నేతలను ఆశ్రయిస్తున్నారు. ఏదిఏమైనా వైద్యశాఖలో భారీగా ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి.

బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి

డీఈవోకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక వినతి

ఒంగోలు విద్య, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని టీచర్ల సంఘాల ఐక్యవేదిక నాయకులు డీఈవో కిరణ్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు స్థానిక డీఆర్ఆర్ఎం స్కూల్‌లో ఆదివారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. బదిలీల్లో పీఎస్ హెచ్ఎం పోస్టులను కోరుకోవాలని, బదిలీకి దరఖాస్తు చేయని ఉపాధ్యాయులను పాఠశాలలో సర్‌ప్లస్ కానప్పటికీ బలవంతంగా చేయించే విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లకు సబ్జెక్టు ఖాళీలతోపాటు పీఎస్ హెచ్ఎం పోస్టులకు ఒకేసారి ఆప్షన్ ఇవ్వాలని, జీవో నంబరు 22లోని 11వ నిబంధనను అనుసరించి పాయింట్ల నమోదును పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మిగిలిన గ్రేడ్-2 హెచ్ఎం పోస్టులను ప్రస్తుత సీనియారిటీ కొనసాగించి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు వి.జనార్దన్‌రెడ్డి, శేషారావు, ఎస్.లక్ష్మీనారాయణ, దిలీప్ చక్రవర్తి, జి.ఉమామహేశ్వరి, కె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.



జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు


ఏడుగుండ్లపాడులో రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

'బండి'డు కష్టాలకు ఇకచెల్లు !

మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

తూర్పునాయుడుపాలెం, కె.ఉప్పలపాడులలో రేషన్ దుకాణాల ప్రారంభం

కొండపి, జూన్1 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల కోసం రోడ్లపై క్యూల్లో నిలిచి ఎండీటీ వాహనాల కోసం ఎదురు చూపులు చూసిన కార్డుదారుల 'బండి'డు కష్టాలు ఇక నుంచి తొలగిపోనున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెం, కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామాల్లో దుకాణాలను మంత్రి ప్రారంభించి, కార్డుదారులకు స్వయంగా రేషన్ సరుకులు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ సరుకులను అందించే కార్యక్రమం పేరుతో 1600 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. నియోజకవర్గంలో దాదాపు 90 వేల పైచిలుకు రేషన్ కార్డులుండగా, ఒకటి రెండు రోజులు కొద్దిమందికి రేషన్ సరుకులు ఇచ్చి చేతులు దులుపుకునేవారన్నారు. ఇకపై అలా ఉండదన్నారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సరుకులు రేషన్ దుకాణాల వద్ద ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఇస్తారన్నారు. తూర్పునాయుడుపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జేసీ ఆర్. గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి పద్మశ్రీ, సర్పంచ్ రవి, కె.ఉప్పలపాడులో మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్, గొర్రెపాటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా రేషన్ పంపిణీ

ఆయా దుకాణాల వద్ద పార్టీ శ్రేణుల సందడి

కొన్నిచోట్ల షాపులను సుందరంగా అలంకరించిన డీలర్లు

సంతనూతలపాడు నియోజకవర్గంలో పలు దుకాణాలను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఒంగోలులో రేషన్‌షాపుల వద్ద రేషన్ పంపిణీ కోలహలంగా ప్రారంభమైంది. ఇప్పటి వరకు మొబైల్ వాహనాల ద్వారా పంపిణీ జరగ్గా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ పంపిణీపై అధ్యయనం చేసి ఆ వ్యవస్థను రద్దు చేసింది. ఈనెల 1వ తేదీ నుంచి రేషన్‌షాపుల వద్ద పాత పద్ధతిలో సాంకేతిక పరిజ్ఞానంతో రేషన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఒంగోలులో అన్ని రేషన్ షాపుల్లో ఆదివారం ఉదయం 8 గంటలకు రేషన్ పంపిణీ ప్రారంభమైంది. సంతపేటలోని రేషన్ షాపులో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముజీర్ జిలానీ సమూన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన కార్డుదారులతో మాట్లాడారు. కార్డుదారులందరూ తప్పనిసరిగా రేషన్‌షాపుల ద్వారా తమ సరుకులను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో


ఒంగోలులో రేషన్‌దుకాణాన్ని సుందరంగా అలంకరించి బియ్యం పంపిణీ చేస్తున్న అధికారులు


సంతపేటలో రేషన్ పంపిణీ చేస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ ముజీర్‌జిలానీసమూన్, మేయర్ సుజాత

మేయర్ గంగాడ సుజాత, తహసీల్దార్ మధుసూదన్‌రావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఇక నగరంలోని అన్ని డివిజన్లలో కార్పొరేటర్లు, ఆయా డివిజన్ల టీడీపీ అధ్యక్షుల పర్యవేక్షణలో కోలహలంగా ఆయా రేషన్‌దుకాణాల వద్ద బియ్యం పంపిణీని ప్రారంభించారు. మరో వైపు మధ్యాహ్న సమయంలో ఆ రేషన్‌షాపు పరిధిలో ఉండే 65 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు పార్టీ శ్రేణులతో కలిసి డీలర్లు సరుకులు అందించారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది.

రేషన్ సరకుల పంపిణీని పక్కాగా నిర్వహించాలి : ఎమ్మెల్యే బీఎన్

చీమకుర్తి: కార్డుదారులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా రేషన్ సరుకులను పక్కాగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. చీమకుర్తి పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రేషన్ దుకాణాలలో సరకుల పంపిణీని పండగ వాతావరణంలో ప్రారంభించారు. చీమకుర్తి పట్టణంలోని తూర్పుబజార్‌లో దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎన్ సరకుల పంపిణీని ప్రారంభించి డీలర్లకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మన్నం రాజ్యలక్ష్మి, మన్నం ప్రసాద్, అడకా స్వాములు, గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, ఉన్నం సుబ్బారావు, రావిపాటి రాంబాబు, కందిమళ్ల గంగాధరరావు, అవనిగడ్డ శేషారావు, పూనాటి వెంకట్రావు, గొల్లపూడి కోటేశ్వరరావు, గంగుల శివపార్వతి, తాతినేని రాము, నర్రా నాగరాజు నాయకులు పాల్గొన్నారు. మండల పరిధిలో చినరావిపాడు, మువ్వావారిపాలెం తదితర గ్రామాల్లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమాలు టీడీపీ నాయకులు గొట్టిపాటి రాఘవరావు, వేల్పుల శ్రీనివాసరావు, ఎనికపాటి లక్ష్మీనరసయ్య, గాలి వెంకటసుబ్బయ్య, ఆయా గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక మద్దులూరు రోడ్డులో రేషన్ దుకాణాన్ని ఆదివారం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ప్రారంభించారు. కార్డుదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా కేవలం రెండు రోజులు మాత్రమే పంపిణీ చేశారని, ఇక నుంచి 15 రోజుల పాటు ప్రభుత్వం నిర్ధేశించిన సమయంలో సరుకులను అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు ఆర్‌వీ.సురేష్‌బాబు, ఆర్.అంకారావు, టి.శ్రీను, ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీరామ్మూర్తి, ఎ.సుమతి, ఎస్‌కే.నాయబ్, బి.శంకర్, పోలిశెట్టి, శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..


ఉప్పుగుండూరులో రేషన్‌సరుకులు అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు: మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 53 రేషన్ దుకాణాలను ఆదివారం పండుగ వాతావరణంలో కూటమి నాయకులు, డీలర్లు ప్రారంభించారు. కార్డుదారులకు బియ్యం, పంచదార బయోమెట్రిక్ విధానంలో అందజేశారు. బి.నిడమానూరులో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, గ్రామ అధ్యక్షుడు ఢాకా శ్రీనివాసరెడ్డి, ఉప్పుగుండూరులో కనగాల శ్రీనివాసరావు, పెంట్యాల కోటేశ్వరరావు, గోగినేని శేషగిరి, కాట్రగడ్డ చంద్రబాబు, నల్లూరి భాస్కర్, పి.సెల్వం, తెలగతోటి జాన్సన్, కొంజేటి రామకృష్ణ కార్డుదారులకు సరుకులను అందజేశారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ బియ్యం పంపిణీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. ఆదివారం ఏడుగుండ్లపాడులో రేషన్‌షాపు వద్ద కార్డుదారులకు ఆయన రేషన్ బియ్యాన్ని అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ రేషన్ షాపులో బియ్యంతో పాటు కందిపప్పు, చెక్కెర ఇవ్వాలన్నారు. మండలంలో 48 రేషన్ షాపులు ఉన్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్, గోరంట్ల చిరంజీవి, మండవ హరిప్రసాద్, మండవ వెంకటస్వామి, ఏడుగుండ్లపాడు సర్పంచ్ దాసరి శిల్పసౌందర్య, దార్ల సుధాకర్, చుండూరి రఘురాం తదితరులు పాల్గొన్నారు. అటు దొడ్డవరప్పాడులో మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో ముల్లూరి మురళి, పాడిబండ్ల అజయ్‌బాబు, బైరపనేని ఫణీంద్రకుమార్, పాడిబండ్ల శ్రీను, డీలర్ బోయపాటి వెంకట్రావు పాల్గొన్నారు.

సింగరాయకొండ మండలంలో..

సింగరాయకొండ: మండలంలో రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసర సరకుల పునఃపంపిణీ కార్యక్రమాన్ని రేషన్ డీలర్లు ఉత్సాహంగా ప్రారంభించారు. సోమరాజుపల్లి రేషన్ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నర్రా రాంబాబు పాల్గొన్నారు. శానంపూడి, సింగరాయకొండ, పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గౌదగట్లవారిపాలెం, పలు గ్రామాల్లోని పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ రవి, ఈఆర్వోలు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.


గౌదగట్లవారిపాలెంలో...

మరో గ్రంథాలయ ఉద్యమానికి ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఒంగోలు కేంద్రంగా ప్రారంభమైన మరో గ్రంథాలయ ఉద్యమానికి ఇంటర్నేషనల్ ఇంక్ బౌండ్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఆ అవార్డును ఉద్యమ వ్యవస్థాపకుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వీసీ నిత్యానందరావు చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా నిత్యానందరావు మాట్లాడుతూ మరో గ్రంథాలయ ఉద్యమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. అటువంటి ఉద్యమాన్ని గుర్తించి కస్తూరి విజయం మాసపత్రిక అవార్డును ఇవ్వటం అభినందనీయమని అన్నారు. కాగా వెంకటేశ్వరరెడ్డిని దార్ల వెంకటేశ్వరరావు, కొమ్మవరపు విల్సన్‌రావు, డాక్టర్ కొర్రపాటి సుధాకర్, కాంతి నల్లూరి, చావలి సుధాకర్‌రావు, తేళ్ల అరుణ, పి.పేరయ్య తదితరులు అభినందించారు.

లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, జూన్1(ఆంధ్రజ్యోతి): లాడ్జీలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం ఒంగోలులోని పోలీసు కల్యాణమండపంలో నగరంలోని లాడ్జీలు, హోటళ్ళ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు లాడ్జీలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. యజమానులు నిబంధనలు తప్పక పాటించాలని, లాడ్జీలకు వచ్చి వెళ్లే వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా మైనర్ బాలికలతో ఎవరైనా వస్తే తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేనిపక్షంలో పోక్సో చట్టం ప్రకారం వారికి ఆశ్రయం కల్పించిన వారు కూడా నిందితులే అని స్పష్టం చేశారు. లాడ్జీలు, హోటళ్ల కౌంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. బస చేసిన ప్రతి అతిథికి సంబంధించిన గుర్తింపుకార్డు, ఫోన్ నంబరు రికార్డు చేయడంతో పాటు క్రాస్ చెక్ చేసుకోవాలని కోరారు. లాడ్జీలలో అసాంఘీక కార్యక్రమాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐలు విజయకృష్ణ, శ్రీనివాసరావు, ఎస్ఐలు నాగరాజు, ఫణిభూషణ్, పున్నారావు, రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సంపదను దోచేస్తున్న కార్పొరేట్ సంస్థలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను కార్పొరేట్ల సంస్థలు దోచుకుంటు న్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం సీపీఐ నగర మహాసభలు ఘనంగా జరిగాయి. ముందుగా కార్యాలయం వద్ద పార్టీ జెండాను ప్రముఖ న్యాయవాది ముదివర్తి రాఘవరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభకు కె.అంజయ్య, ఇస్తర్ల నరసింహారావు, సీహెచ్.వెంకటేశ్వర్లు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఒక వైపు పాకిస్తాన్‌తో శాంతిచర్చలకు వస్తామని ప్రకటించి ఆపరేషన్ కగార్ పేరుతో దండకార్యంలో మావోయిస్టులపై మారణహోమం సాగిస్తున్నారని ఆరోపించారు. ఆగస్టు 20 నుంచి 25వతేదీ వరకు ఒంగోలులో సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను జరుగుతాయని, వాటిని విజయవంతంచేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ ఈనెల 21నుంచి మూడు రోజుల పాటు దర్శిలో పార్టీ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యక్రమంలో నాయకులు ఆర్.వెంకట్రావు, ఆర్.రామకృష్ణ, కారుమూడి నాగేశ్వరరావు, నూనె మోహన్‌రావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు


రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

సంతనూతలపాడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఒంగోలుకు చెందిన వెంకటరమణ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. తొలుత ఈ వైద్యశిబిరాన్ని డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

22న వ్యవసాయ రంగంపై సెమినార్

మద్దిపాడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని బృందావనం కళ్యాణ మండపంలో ఈ నెల 22న వ్యవసాయ రంగం కార్పొరేటీకరణ అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు రైతు సంఘం అధ్యక్షులు కనపర్తి సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కిసాన్ జాతీయ ఉపాధ్యక్షులు ఆమ్రారం, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు తదితరులు హాజరవుతారన్నారు. రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

4నుంచి శ్రీగిరి బ్రహ్మోత్సవాలు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఝాన్సీరాణి

ఒంగోలు కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 4వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరి ఝాన్సీరాణి తెలిపారు. ఆదివారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆమె ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4వ తేదీ సాయంత్రం అంకురార్పణ, విష్వక్సేన పూజ, మేదినీ పూజ, వాస్తు హోమం, 5న రక్షాబంధనం, ధ్వజారోహణం, పొన్నూరు వెంకట శ్రీనివాసులుచే ప్రహ్లాద చరిత్ర ఉపన్యాసం, 6న ఊంజల్‌సేవ, వినోద్‌కుమార్‌చే గాత్రకచేరి, 7న శ్రీవారికి చక్రస్నానం, శరణ్య కూచిపూడి డాన్స్ అకాడమీ కళాకారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన, 8న ఉదయం శ్రీవారి కళ్యాణం, సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనుక భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రేడ్-2 హెచ్ఎంల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు విద్య, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ సోమవారం స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో జరుగుతుందని డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న 3హెచ్ఎంలతో పాటు రిటైర్డ్ అయిన 2 హెచ్ఎం పోస్టులకు ఈ కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన సీనియారిటీ జాబితాలో మిగిలిన సీరియల్ నెంబరు 141 నుంచి ఉపాధ్యాయులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

మూగజీవాల సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మూగజీవాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డెంపూడి సుజాత పేర్కొన్నారు. సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మూగ జీవాల సంరక్షణపై అవగాహన కల్పించారు. సంస్థ వ్యవస్థాపకురాలు తాటిపర్తి దివ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి కోసూరి శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు జంతువుల పట్ల అవగాహనతో మెలగాలన్నారు. మారెళ్ల సుబ్బారావు, చిక్కాల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పంచాయతీశాఖ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యాలయ పరిధిలో (పంచాయతీవిభాగం) పనిచేస్తున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు ఆదివారం తెలిపారు. డిప్యూటీ మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి గ్రేడ్ 6 వరకు పనిచేస్తున్న వారికి, డీపీవో కార్యాలయ సిబ్బందికి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఒకేస్థానంలో ఐదేళ్ళకు పైబడి పనిచేస్తున్న వారు, బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారు హాజరుకావాలని కోరారు.

భవనాలు పాడుబడ్డాయని వదిలేయొద్దు..

- మంత్రి డాక్టర్ స్వామి
- ముప్పవరం జడ్పీస్కూల్ పరిశీలన


సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి స్వామి, జేసీ గోపాలకృష్ణ

కొండపి, జూన్1 (ఆంధ్రజ్యోతి): 'భవనాలు పాడుబడ్డాయని వదిలేయవద్దు... అవసరాలకు అనుగుణంగా మరమ్మతులు చేసుకుని విద్యార్థులకు ఉపయోగపడేలా వినియోగించుకోవాలి' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం మండలంలోని ముప్పవరం గ్రామంలోని జడ్పీస్కూల్ పూర్వ విద్యార్థులు సొంత నిధులతో నిర్మిస్తున్న ముఖద్వారాన్ని మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా స్కూల్‌లోకి వెళ్లి స్కూల్‌లోని భవనాలను పరిశీలించారు. పాడుబడిన పలు భవనాలను పరిశీలించిన మంత్రి వాటిని వదిలేయకుండా కొద్దికొద్ది మార్పులు చేసుకుని సైకిల్ స్టాండ్లుగా, భోజన హాల్‌గా మార్చుకుని వినియోగంలోకి తేవాలన్నారు. స్కూల్‌కు మరోగేటు కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని పశువులు, ఇతరులు స్కూల్‌లోకి ప్రవేశించకుండా ప్రహరీని కట్టుదిట్టం చేసుకోవాలన్నారు. ఇందుకు స్కూల్ పూర్వపు విద్యార్థులు, ముప్పవరం, మిట్టపాలెం గ్రామదాతలు ఆర్థికం సహకారం అందించుకోవాలని మంత్రి సూచించారు. మంత్రి వెంట కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, నాయకులు బత్తుల నారాయణస్వామి, ఎల్అండ్‌టీ శ్రీనివాసరావు, మిట్టపాలెం నాయకులు కొల్లూరి శ్రీహరి, వీరాస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన

టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో ఎస్సీకాలనీ, పాత ఎస్సీ కాలనీల్లో 2 కోట్ల రూపాయలతో నిర్మించనున్న సీసీరోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా శిలాఫలకాన్ని ప్రారంభించి, అక్కడే మొక్కను మంత్రి నాటారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ కొండపి సెక్షన్ డీఈ జె.రవిబాబు, అధికారులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్ !

పూర్తిస్థాయిలో చేరుకున్న పాఠ్య, రాత పుస్తకాలు

త్వరలో రానున్న స్కూల్‌బ్యాగ్‌లు, షూస్, బెల్టులు

బడులు తెరిచే సమయానికి విద్యార్థులకు అందుబాటులో విద్యాసామగ్రి

సంతనూతలపాడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో గాడి తప్పిన విద్యావ్యవస్థను సరిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు ఉచితంగా అందించే విద్యా సామగ్రిని పాఠశాలలు తెరిచే నాటికి అందించేందుకు చర్యలును వేగవంతం చేసింది. ఈమేరకు సంతనూతలపాడు మండలకేంద్రంలోని స్టాక్ పాయింటుకు సంబంధిత సామగ్రి చేరుకుంది. గత ప్రభుత్వంలో విద్యా సామగ్రి సకాలంలో రాకపోవడంతో రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. దీనికితోడు బూట్లు, బ్యాగుల్లో నాణ్యత లోపించి చిరిగిపోతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

పిల్లలపై తగ్గనున్న భారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు పుస్తక భారాన్ని తగ్గించింది. గతంలో ఒకటి, రెండు తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు, తెలుగు, లెక్కలు వర్కుబుక్‌లు కలిపి మొత్తం ఆరు పుస్తకాలు ఉండేవి. ఇపుడు వీటిని 4 పుస్తకాలకు పరిమితం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు 3 నుంచి 5వ తరగతి వరకు 8 పుస్తకాల స్థానంలో సగానికి తగ్గించారు. మిగిలిన తరగతుల్లో కూడా భారం తగ్గించడంతో వివిధ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


స్టాక్ పాయింట్లో పుస్తకాలు సర్దుతున్న సిబ్బంది


స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాలను తరలింపు

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర పేరిట..

విద్యార్థులకు అందించే మధ్యాహ్నాభోజన పథకానికి కూటమి ప్రభుత్వం డొక్కాసీతమ్మ మధ్యాహ్నాభోజన పథకంగా పేరు మార్చింది. ఇదే తరహాలో విద్యాసామగ్రికి కూడా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరు నామకరణం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజన విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన సామగ్రిని అందిస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

సంతనూతలపాడు మండలంలో..

మండలంలో 46 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మండలంలో 1వ తరగతి నుంచి 10 వతరగతి వరకు 3,510 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికి కలిపి 17,417 పాఠ్యపుస్తకాలు, 20,924 రాతపుస్తకాలు, 3,510 యూనిఫామ్‌లు వచ్చాయి. బూట్లు, బెల్ట్‌లు, స్కూల్ బ్యాగులు రావాల్సి ఉంది. అవి కూడా విద్యా సంవత్సరం ప్రారంభం లోపే వస్తాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, యూనిఫాంలు పూర్తి స్థాయిలో చేరుకున్నా.. రావాల్సిన లిస్టులో మాత్రం బూట్లు, బెల్ట్‌లు, స్కూల్ బ్యాగులు ఉన్నాయి. వాటిని రప్పించేందుకు మండలస్థాయి అధికారులు జిల్లా అధికారులకు సమాచారం అందజేశారు. ఈక్రమంలో వచ్చిన విద్యా సామగ్రిని గత రెండు రోజుల నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు తరలిస్తున్నారు.

ఆధునికీకరణం

ఒంగోలులోని పోతురాజు కాలువ పూడికతీత పనులపై శాఖల మధ్య లోపించిన సమన్వయం

కలిసి రాని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
మురుగు సమస్య కావడంతో కార్పొరేషన్‌కు తప్పని తిప్పలు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : **2010 మే 19వ తేదీ..** ఆరోజు గుర్తుకు వస్తేనే శివారుకాలనీ ప్రజలు ఉలిక్కిపడతారు. ఆ రోజు అర్ధరాత్రి అకస్మాత్తుగా వచ్చిన లైలా తుఫాన్ నగరాన్ని అతలాకుతలం చేసింది. ఉప్పెనలా విరుచుకుపడిన తుఫాన్ బీభత్సానికి నగరం నీట మునిగిపోవడమే కాకుండా వందలాది కుటుంబాలు కట్టుబట్టలతో బతుకుజీవుడా అంటూ పరుగులు పెట్టిన భయంకరమైన దుస్థితి. ఇళ్లలోకి చేరిన నీటి ప్రవాహంలో, పురుగులు, పాముల మధ్య గడిపిన దయనీయమైన ఘటనకు పదిహేనేళ్లు నిండాయి. అయినా పోతురాజు కాలువ పూడికతీత పనులు పూర్తికాలేదు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోగా, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పనులు ప్రారంభించే దిశగా దృష్టి సారించింది. అందులో భాగంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, గత అసెంబ్లీ సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రస్తావించారు. పోతురాజు కాలువ పనుల్లో గత వైసీపీ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తూనే జరిగిన అవినీతి, పనుల రద్దు గురించి మాట్లాడారు. అందులో భాగంగా కొత్త డీపీఆర్ తయారు చేసి కాలువ ఆధునికీకరణను పునఃప్రారంభించాలని చూస్తున్నారు. కాలువ పనులపై కార్పొరేషన్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో సమస్యకు పరిష్కారం ఎలా ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాలువలో పూడికతీత పనులు

టన్నుల కొద్దీ మురుగు.. తీసేందుకు అడ్డంకులు

ప్రస్తుతం పోతురాజు కాలువలో టన్నుల కొద్ది పూడిక పేరుకుపోయింది. కాలువ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో కార్పొరేషన్ అధికారులు 20 రోజుల నుంచి పూడికతీత ప్రారంభించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన హయాంలోనే పనులు పూర్తి చేయాలని గట్టిగా భావిస్తుండగా, మూడు శాఖల మధ్య సమన్వయ లోపం వలన జాప్యం చోటుచేసుకుంటోంది. కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు, డెక్క, డిషిల్ట్, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పెద్ద సమస్యగా మారింది. దీంతో కావలి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన భారీ ఎక్స్‌వేటర్‌తో పనులు జరుగుతున్నాయి.

పనులు పూర్తి చేయలేక చేతులెత్తేసిన వైసీపీ

2014-19 తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రూ.40 కోట్లతో పనులు కొంతమేర చురుగ్గా సాగాయి. తదనంతరం 2019లో వైసీపీ అధికారంలోకి రాగా, పోతురాజు కాలువ పూర్తిచేయడానికి అప్పటికీ రూ.80 కోట్లు అవసరం అని అధికారులు మళ్లీ లెక్కలు కట్టారు. నిధుల విడుదల సంగతి పక్కన పెడితే ఆక్రమణల తొలగింపుల్లో రాజకీయ జోక్యం తోడైంది. ఐదేళ్లు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆ పనులను రద్దు చేశారు. దీంతో కాలువ ఆధునికీకరణ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

మొదట రూ.12.5 కోట్లు.. ఆ తర్వాత రూ. 80 కోట్లు

మొదట్లో పోతురాజు కాలువ ఆధునికీకరణ చేపట్టేందుకు రూ.12.50 కోట్లు కేటాయించారు. పేర్నమిట్ట సమీపంలో ఆరంభమై, క్విస్ పబ్లిక్ స్కూలు సమీపం గుండా గణేష్ నగర్, జయప్రకాష్ కాలనీ, నెహ్రూనగర్, పాపా కాలనీ, భగత్ సింగ్ కాలనీతోపాటు మొత్తం 14 కాలనీల మీదుగా దాదాపు 6 కిలోమీటర్ల వరకు విస్తరించింది. ఈ కాలువ పనులను ప్రారంభించేందుకు రూ.11.78 కోట్లను అప్పటి సీఎం రాజశేఖరెడ్డి కేటాయించారు. ఆ తర్వాత టీడీపీ అధికారంలోకి రాగా, పూర్తి స్థాయిలో పనులు చేపట్టడానికి సుమారు రూ.40 కోట్లు అవసరం అని అధికారులు లెక్కలు కట్టారు. అప్పటి ఎమ్మెల్యే దామచర్ల హయాంలో గుంటూరు రోడ్‌లోని పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టడంతోపాటు బ్రిడ్జినీ కూడా నిర్మించారు. కాలువ కరకట్టపై కొన్ని నివాస గృహాలు ఉండటంతో మిగిలిన పనులకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఆ తర్వాత అధికారులు వాటిని తొలగించేందుకు ముందడుగు వేకపోవడం, తదనంతరం ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి.

• ఒంగోలు నగర జనాభా	3,10,694.
• అన్ని రకాల గృహాల సంఖ్య	68,848.
• శివారు కాలనీలు	53
• శివారు కాలనీల జనాభా	25 వేలకు పైనే
• ముంపు వాటిల్లే ప్రాంతాలు	37 కాలనీలు
• పూర్తిగా నీట మునిగే గృహాలు	1,181
• రిహాబిలిటేషన్ సెంటర్లు	5-10 కేంద్రాలు
• శిబిరాలు నిర్వహణ రోజులు	3-5 రోజులు
• విపత్తుల్లో బాధితుల పేరుతో ఖర్చు	1కోటి(సుమారు)
• పక్కా డ్రెయిన్లు	348 కి.మీ
• కచ్చా డ్రెయిన్లు	175 కి.మీ
• స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్లు	23.50 కి.మీ
• పోతురాజు కాలువలో కలిసేవి	34 డివిజన్ల మురుగునీరు
• నల్లకాలువలో కలిసేవి	16 డివిజన్ల మురుగునీరు

ప్రజలకు ఇబ్బంది రాకుండా పనులు

కే వెంకటేశ్వరరావు, నగర కమిషనర్

రానున్న వర్షా కాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కార్పొరేషన్ నిధులు రూ.1.6 కోట్లతో పోతురాజు కాలువ, నల్లకాలువల్లో పూడికతీత పనులు చేపట్టాం. కాలువ నిర్వహణ బాధ్యతలు ఇరిగేషన్ వారే చూసుకోవాల్సి ఉండగా, వారు పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు.

ప్రస్తుతం మాకు సంబంధం లేదు

రవికుమార్, ఇరిగేషన్ ఈఈ

పోతురాజు కాలువ పనులు 2024లో రద్దు కావడంతో ప్రస్తుతం మాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ పనుల బాధ్యత కార్పొరేషన్ వారిదే. పోతురాజు కాలువ, నల్లకాలువ ఇరిగేషకు సంబంధించినప్పటికీ కార్పొరేషన్ పరిధిలో ఉండటంతో వాటి నిర్వహణ బాధ్యతలు కార్పొరేషన్ వారే చూసుకోవాలి. మంచి నీటి కాలువలను మాత్రమే తాము పర్యవేక్షించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి కూడా లేఖ రాశాం.

కె.ఉప్పలపాడుపై చిన్నచూపులేదు

మాజీ ఎమ్మెల్యేతో మంత్రి స్వామి సంభాషణ


మాట్లాడుతున్న మంత్రి స్వామి

కొండపి, జూన్1 (ఆంధ్రజ్యోతి): కె.ఉప్పలపాడు గ్రామంపై తనకు ఎప్పుడూ చిన్నచూపులేదని, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు హయంలో గ్రామంలో శివాలయం నిర్మించడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, తర్వాత తన హయాంలోనే సీసీరోడ్లు, తారురోడ్లు వేశామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం గ్రామంలో రేషన్ షాపు ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్ గ్రామంలోని పలు సమస్యలను ప్రస్తావించి పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో ఎప్పుడూ టీడీపీకి మెజార్టీ రావడం లేదని అందువల్లనే మంత్రి గ్రామాన్ని చిన్నచూపు చూస్తున్నారని అచ్యుత్‌కుమార్ సభలో అన్నారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ 2014-19లో గ్రామం నుంచి రెండు కోట్ల రూపాయలతో చిర్రికూరపాడు గ్రామానికి తారురోడ్డు వేశామన్నారు. అయినా తర్వాత ఎన్నికల్లో రెండు గ్రామాల్లో మెజార్టీ రాలేదని గుర్తు చేశారు. అదేకాలంలో గ్రామంలో లక్షల రూపాయలతో సిమెంటు రోడ్డు శ్మశానవాటికలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు హయాంలో, తర్వాత తన హయాంలో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తుచేశారు. వైసీపీ పాలనలో గ్రామంలో ఏ పనీ జరగలేదని మంత్రి అన్నారు. పార్టీకి, తనకు మెజార్టీలు రాకపోయినా తనకు ఓటు వేసిన వారికైనా న్యాయం చేయాలి కదా? రోడ్లపై ఓట్లు వేయని వారు ఎక్కువ మంది నడిచినా, తక్కువ మంది తనకు ఓటు వేసినవారు నడిచినా తాను ఆ విషయాన్ని పట్టించుకోనన్నారు. గ్రామంలో సీసీరోడ్లు వేస్తానని మంత్రి అన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి 20 లక్షల రూపాయలు తాగునీటి ట్యాంకు నిర్మాణానికి మంజూరు చేశానని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా అచ్యుత్‌కుమార్ ప్రస్తావించిన అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని మంత్రి హామీనిచ్చారు. గ్రామంలోని ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాల్వలు నిర్మించాలని, గ్రామం నుంచి పందలపాడుకు వెళ్లే డొంకరోడ్డును, నల్లవాగు మీదగుండా వెళ్లే గురవారెడ్డి డొంకను బాగు చేయాలని, గ్రామంలోని పలు వీధుల్లో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయని, ఎత్తైన స్తంభాలు వేసి తీగలు వాహనాలకు తగలకుండా చూడాలని అచ్యుత్‌కుమార్ మంత్రికి సూచించారు.

3 ఎకరాల్లోని బొప్పాయితోట నరికివేత


నరికేసిన బొప్పాయితోట

కొండపి, జూన్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్లూరు గ్రామానికి చెందిన కల్లూరి చంద్రమౌళి అనే రైతుకు చెందిన 5 ఎకరాల బొప్పాయి తోటలోని 3 ఎకరాల్లోని చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి నరికివేశారు. దీంతో యజమానికి దాదాపు వంద టన్నులకుపైగా నష్టం వాటిల్లింది. వీటి విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని అంచనా. గతంలో కొండపి ప్రాంతంలో ఇటువంటి దుశ్చర్యలు ఎన్నడూ జరగలేదు. బాధిత రైతు అన్న గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు. ఆ నాయకుడు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమంగా అనేక ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమించి అతని పేరున, కుటుంబ సభ్యుల పేరున ఆన్‌లైన్ చేయించుకున్నాడన్న విమర్శలున్నాయి. అతను టీడీపీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో ఉండటం లేదు. వైసీపీ నాయకుడి తమ్ముడి బొప్పాయి తోటను నరికి వేయడానికి రాజకీయ కారణాలా? వ్యక్తిగత కోపాలా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. బాధిత రైతు ఆదివారం కొండపి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపికకు విశేష స్పందన


క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న పీడీసీఏ ప్రతినిధులు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా బాల, బాలికలు, సీనియర్స్ పురుషుల జట్లు ఎంపికకు విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక మంగమూరు రోడ్‌లోని పీడీసీఏ మినీ లార్డ్స్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు ప్రకాశం జిల్లాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాటింగ్, బౌలింగ్, ఇతర విభాగాల్లో ప్రతిభ చాటిన వారిని అండర్ 15, అండర్ 19, సీనియర్స్ జట్లుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంపికైనజట్లు జూన్ 10వ తేదీ నుంచి మంగళగిరిలోని మూలపాడులో జరిగే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు మాజీ ఆంధ్ర రంజీ క్రీడాకారుడు శరత్ సెలక్టర్‌గా వ్యవహరించగా, పీడీసీఏ కోశాధికారి హనుమంతరావు, సభ్యులు బలరాం, రాము, మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


చందలూరులో టీచర్లతో పూర్వ విద్యార్థులు


తర్లుపాడులో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చిన్ననాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. పిల్లల మాదిరి ఒదిగిపోయారు. ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆప్యాయతలను పంచుకున్నారు. చదువుకున్న బడిని, అక్షరాలు దిద్దిచ్చిన గురువులను స్మరించుకున్నారు. ఆదివారం చందలూరు, తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పండుగ వాతావరణాన్ని తలపించింది. పంగులూరు మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాల అవసరాలకు గివింగ్ బ్యాంక్ నిధిగా రూ.1.50లక్షలను సమకూర్చారు. హెచ్‌ఎం గిరిజ, రిటైర్డ్ హెచ్‌ఎం నార్నె తాతయ్య, రామిశెట్టి శ్రీనివాసరావు, అజిత్ ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ, పాఠశాల వ్యవస్థాపక ప్రతినిధులు అడ్డగడ సుబ్బయ్య, బసవేశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ రావి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తర్లుపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 2000-01 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు చదువు నేర్పిన గురువులు జే కృష్ణమూర్తి, అని విలాసిని, జె.కృష్ణమూర్తి, బి.వెంకటేశ్వరరెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, ఎస్‌కే ఈశ్వర్, పి.కోటి మోహన్‌లను సన్మానించారు. పూర్వ విద్యార్థి సాగర్ మాట్లాడుతూ తనతో చదువుకున్న మాలపాటి వెంకటేశ్వరరెడ్డి, తిరుమలరెడ్డి శ్రీనివాసులరెడ్డి, తాడి బోపాల్‌రెడ్డి, రవికుమార్ మరణించారని, వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సుధాకర్‌బాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ వెన్నా రాజారామిరెడ్డి, ఉపాధ్యాయులు గోసు శ్రీనివాసులు పాల్గొన్నారు. **-పంగులూరు/తర్లుపాడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి)**

కౌశిక్ సివిల్స్‌లో ర్యాంక్ సాధించటం గొప్పవిజయం

అభినందన సభలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి



కౌశిక్‌ను సన్మానిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, నాగేశ్వరరావు

ఒంగోలు రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : అన్ను కౌశిక్ నరసింహ సివిల్‌లో 225 ర్యాంక్ సాధించటం గొప్ప విజయం అని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విజేతగా నిలిశాడని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. ఒంగోలు నార్త్ బైపాస్ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం పేర్నమిట్ట గ్రామవాసి అన్ను కౌశిక్ నరసింహ ఆత్మీయ అభినందన సభను గ్రామస్థులతోపాటు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ సివిల్ సర్వీస్‌తో పేదరిక నిర్మూలనకు, సమాజ మార్పుకు తోడ్పడాలన్నారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ సివిల్ సర్వీస్‌కు ఎంపికైన వారు ప్రజలకు సేవ చేయటానికి మంచి అవకాశాలు ఉంటాయని చెప్పారు. కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కౌశిక్ జిల్లాకే వన్నెతెచ్చారన్నారు. కౌశిక్ తల్లితండ్రులు వేణుగోపాల్, తల్లి అరుంధతీ, కబడ్డీ అసోసియేషన్ నాయకులు నల్లూరి సుబ్బారావు, చంద్రమోహన్‌రెడ్డి, వై పూర్ణ చంద్రరావు, దాసరి రమేష్, కె.ప్రసాదు, ఎస్ రామ్‌బాబు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సీతారామిరెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హాజీరాబేగమ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు పున్నయ్య చౌదరి పాల్గొన్నారు.

పోరాట యోధుని జ్ఞాపకాల కోసం...

నేడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి
చీరాల-పేరాల ఉద్యమంతో బ్రిటీష్‌వారిపై తిరుగుబాటు
శిథిలమైన ఆయన సమాధి
కలెక్టరేట్‌లో ట్రస్టుకు సంబంధించిన సుమారు రూ. కోటి నిధులు


గోపాలకృష్ణయ్య

చీరాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా చేనేతల పక్షాన చేసిన ఉద్యమానికి దేశవ్యాప్తంగా గుర్తింపును తీసుకొచ్చిన మహనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. సోమవారం ఆయన 136వ జయంతి. అనారోగ్యం బారినపడి 40 ఏళ్లకే మృత్యువాత పడగా ఇక్కడే అంత్యక్రియలు జరిగాయి. నేడు ఆయన ఆనవాళ్లు కూడా లేకపోవడం విచారకరం.

● దుగ్గిరాల విద్యాభ్యాసం

ఉమ్మడి కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు కోదండరామస్వామి, సీతమ్మకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 1889 జూన్ 2న జన్మించారు. ఆయన పుట్టిన మూడో రోజే తల్లి, మూడేళ్లకు తండ్రి మృతిచెందారు. చిన్నాన్న, నానమ్మల సంరక్షణలో ఉంటూ గుంటూరు జిల్లా కూచినపూడిలో విద్యనభ్యసించారు. అనుకోని రీతిలో మెట్రిక్యులేషన్ తప్పగా, బాపట్లలో చదివి పూర్తి చేశాడు. ఆ తర్వాత 1911 ఇంగ్లండ్ వెళ్లి ఎంఏ పూర్తి చేశాడు. స్వదేశం తిరిగి వచ్చాక కొంతకాలం రాజమండ్రి, బందరు ప్రాంతాల్లో ఉపాధ్యాయునిగా సేవలు అందించారు. అప్పటికే గాంధీజీ ప్రభావంతో స్వతంత్ర సంగ్రామంపై మక్కువ పెంచుకున్నారు.

● పన్ను నిరాకరణకు చీరాల-పేరాల ఉద్యమం

1919లో భార్య అనారోగ్యం పాలవడంతో ఆమెకు చికిత్స అందించేందుకు చీరాల సాల్మన్ సెంటర్‌లోని బేర్ వైద్యశాలకు వచ్చారు. ఆ సమయంలో బ్రిటీషు వారు చీరాల-పేరాల రెండు గ్రామాలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసి రూ.4 వేల పన్నును, ఒక్కసారిగా రూ.40 వేలకు పెంచారు. పన్ను భారంతో సమస్యలు ఎదుర్కొంటున్న నేతన్నలు, చిన్న సన్నకారు రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వేదన పడుతున్నారు. వైద్యశాలలో భార్యకు చికిత్స అందిస్తున్న గోపాలకృష్ణయ్య ఈ విషయం తెలుసుకొని ప్రజలకు మద్దతు తెలిపారు. సుమారు 1000 మందితో రామదండు పేరుతో వలంటీర్ సంఘాన్ని ఏర్పాటు చేసి ఉద్యమ బాట పట్టారు. అదే సమయంలో విజయవాడ విచ్చేసిన గాంధీజీను కలిసి సమస్యను వివరించారు. గాంధీజీ సూచనల మేరకు చీరాల- పేరాల్లో ఉన్న సుమారు 15 వేల మంది ప్రజలు 1921 ఏప్రిల్ 25న ఆ ప్రాంతాలను బహిష్కరించి ఊరి పొలిమేర ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ ప్రాంతానికి రామ్‌నగర్ పేరు పెట్టారు. ఆ ప్రాంతంలోనే ఉండి గోపాలకృష్ణయ్య ఉద్యమించారు.

ఈ పోరాటాల పరంపరలో ఆయన జైలు జీవితం గడిపి తిరిగి వచ్చాక 1928 జూన్ 10న గుంటూరులో తుదిశ్వాస విడిచారు. ఆయన చివరి కోరిక మేరకు ప్రజలు గుంటూరు నుంచి పార్థివదేహాన్ని చీరాలకు తరలించి ర్యాలీ చేశారు. రామనగర్‌లో ఆయన నివసించిన ప్రాంతంలోనే ఖననం చేశారు. జీవించి ఉన్న రోజుల్లో కోదండ రామాలయం, స్మారక మందిరం, లైబ్రరీ ఏర్పాటు చేయాలని కలలు కన్నారు. అందుకు సంబంధించి చివరి రోజుల్లో గోపాల కృష్ణయ్య వీలునామా కూడా రాశారు. కాలక్రమేణ అవి కలలుగానే మిగిలిపోయాయి.

● కోల్పోతున్న ఆనవాళ్లు

శ్రీమదాంధ్ర విద్యాపీఠాన్ని 1921లో గోపాల కృష్ణయ్య స్థాపించారు. అందుకు సంబంధించి చీరాల పరిధిలో ఐదుగురు సభ్యులు ఉన్నారు. ట్రస్టుకు సంబంధించి రామనగర్ ప్రాంతంలో సుమారు 20 ఎకరాల భూమి ఉంది. ట్రస్టు సభ్యులు 1990లో ఆ భూమిని విక్రయించారు. అదే సమయంలో దుగ్గిరాల కుమారుడు న్యాయవాది శ్రీరామచంద్రమూర్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో 2000లో చీరాల కోర్టు న్యాయాధికారి ఆస్తులు ఎవ్వరికి సంబంధం లేదని ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టరేట్‌కు స్వాధీన పరిచారు. నగదును బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసింది. అలాగే కొత్త కమిటి ఏర్పడి ఆ నగదును గోపాలకృష్ణయ్య పార్కు, తదితర నామస్మరణ కార్యక్రమాలకు ఉపయోగించాలని, ఆ కమిటీకి జిల్లా కలెక్టర్‌ను శాశ్వత చైర్మన్‌గా ఉంటారని ఆదేశించింది. ప్రస్తుతం ఆ నగదు సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు చేరింది. ఈ కమిటీ కార్యక్రమాలు నేటికీ క్రియాశీలకం కాలేదు. చివరకు ఇక్కడ గోపాల కృష్ణయ్య సమాధిని కూడా ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ఆ పరిసరాలు చిల్లచెట్లతో నిండి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం గోపాలకృష్ణయ్య జయంతికి ప్రాధాన్యత ఇచ్చి ఆయన సేవలను గుర్తించాలని పలు సేవా సంస్థల నిర్వాహకులు కోరుతున్నారు.


శిథిలమవుతున్న దుగ్గిరాల సమాధి

3న త్రిపురాంతకం ఆలయం వద్ద యోగా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర-25 మాసోత్సవాల్లో భాగంగా త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర ఆలయం వద్ద ఈనెల 3వ తేదీ ఉదయం 6 నుంచి 8గంటల వరకు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని కోరారు. యోగా కార్యక్రమానికి హాజరయ్యే వారు తమతో పాటు యోగా మ్యాట్‌ను తీసుకురావాల్సిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

ఉపాధి(కి) హామీ

» కూలీలకు దొరుకుతున్న పనులు
» వైపాలెం నియోజకవర్గంలో రోజూ 50వేల మంది హాజరు

త్రిపురాంతకం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పనులు కోసం ఎదురు చూసే కూలీలకు ఉపాధి హామీ పథకం వరంగా మారింది. రోజువారీ కూలీల వేతనాలకు ఈ పథకం గొప్ప హామీని ఇచ్చిందనే చెప్పాలి. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో ఉపాధి కోసం గతంలో వలసలు అధికంగా ఉండేవి. పనులు లేక కూలీలు ఇబ్బందులు పడేవారు. అటువంటి పేద జీవులను ఈ పథకం ఇప్పుడు ఆదుకుంటోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలతో పోలిస్తే ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కూలీలు అధిక సంఖ్యలో హాజరై పనులు చేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా చెరువుల్లో పూడిక తీత పనులు, నీటికుంటలు తవ్వకం, కొండప్రాంతాల్లో నీటి నిల్వల కోసం కందకాలు వంటివి చేపట్టారు. ఇటీవల వర్షాలు కురుస్తున్న కారణంగా చాలా చోట్ల చెరువుల్లో పనులు నిలిచిపోయాయి. పనులు ప్రారంభించినప్పటి నుంచి ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ప్రతిరోజూ సగటున 50 వేల 200 మంది కూలీలు పనులకు హాజరవుతూ ఉపాధి పొందుతున్నారు. ఇందులో ఎక్కువ మంది వైపాలెం మండలం నుంచి హాజరవుతుండగా, తక్కువగా దోర్నాల మండలం నుంచి హాజరవుతున్నారు. ఇవి కాక పలుచోట్ల నీటితొట్టెల నిర్మాణాలు కూడా ముమ్మరంగా చేపట్టి పశువులకు నీటి సమస్య లేకుండా చేస్తున్నారు. మండలాల్లో గోకుల షెడ్ల నిర్మాణాలతో కొందరు పశు పోషకులకు కూడ వ్యక్తిగతంగా ఎంతో మేలు జరుగుతుందని చెప్తున్నారు.

మండలాలవారీగా కూలీల హాజరు

పుల్లలచెరువు	11,000
పెద్దారవీడు	9,200
త్రిపురాంతకం	10,500
ఎర్రగొండపాలెం	12,000
దోర్నాల	7,500



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



నీటి కుంటలను తవ్వుతున్న కూలీలు

కూలీల వేతనాలు జాప్యం

పనులు చేసిన కూలీల వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని వాటిని త్వరగా చెల్లిస్తే ఇబ్బందులు లేకుండా ఉంటుందని కూలీ లు చెప్తున్నారు. పనులు చేసిన తరువాత ఎప్పటికప్పుడు మస్టర్లు కంప్యూటర్లో నమోదు చేస్తూ వేతనాలు జనరేట్ చేయడం జరుగుతుందని నగదు జనరేట్ అయి ఉన్నాయని నిధులు విడుదల కాగానే కూలీల ఖాతాల్లో నగదు జమ అవుతుందని అధికారులు చెపుతున్నారు. చేసిన పనులను బట్టి కొన్ని మండలాల్లో ఆరు వారాలు, కొన్ని మండలాల్లో నాలుగు వారాలపాటు పనులకు సంబంధించిన వేతనాలు విడుదల కావాల్సి ఉందని చెబుతున్నారు. మొత్తానికి పనులు కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తూ ఉపాధికి ఇబ్బందులు లేకుండా చేస్తున్న ఈ పథకం ద్వారా తమకు ఎంతో మేలు జరుగుతుందని కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ పనులు వచ్చేవరకు ఉపాధితో ఉపయోగం



రైతువారీ పనులు ప్రారంభమయ్యేవరకు ఈ పథకాన్ని కూలీలు ఉపయోగించుకోవచ్చు. 100 రోజులు పనిదినాలు ఉపయోగించుకోండి. కూలీల వేతనాలు నిధులు విడుదల కాగానే ఖాతాల్లో జమ అవుతాయి. మీ నగదుకు ఎటువంటి ఇబ్బందులు లేవు. ప్రతి వారం చేసిన పనుల మస్టర్లు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాం.

- వై.సుజాత, ఏపీవో, త్రిపురాంతకం



ఆటలు నేర్చుకుంటున్న విద్యార్థులు

వేసవి శిక్షణతో ఎన్నో ప్రయోజనాలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని గ్రంథపాలకుడు శివారెడ్డి అన్నారు. శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చదరంగం, చిత్రలేఖనం, పుస్తకాలు చదవడం, కథలు చెప్పించడంలో శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సందర్భంగా ఈనెల 4న చేతి రాత పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు శివారెడ్డి తెలిపారు.

గిద్దలూరు : విద్యార్థి దశలో చదువుతోపాటు క్రీడలు నేర్చుకోవడం కూడా ముఖ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదరంగం, క్యారమ్స్ స్నేక్‌చార్ట్ క్రీడల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించి పోటీలు ఏర్పాటు చేశారు. ఈపోటీల్లో విజేతలైన వారికి ఐటి ఉద్యోగి పి.వెంకటరత్నం బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్నకుమారి, యువ ప్రగతిపథం వ్యవస్థాపకులు ఫరూఖ్, విశ్రాంత ఉపాధ్యాయుడు రామిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటంలో ఉపాధ్యాయులు, సిబ్బందిది కీలక పాత్ర అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందిన ఏరువ వెంకట కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డిని సన్మానించారు. పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తు పదోన్నతిపై గజ్జలకొండ జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ అయిన ఆదిమూలపు శ్యామ్ సుభాకర్‌ను సన్మానించారు. చింతగుంట బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయులు డీ రామంజనేయురెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వొద్దుల వీరారెడ్డిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన హెచ్‌ఎంల బాధ్యతల స్వీకరణ



హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసన్నతాంజలి

పెద్ద దోర్నాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన ప్రధానోపాధ్యాయినిగా పల్లెకోన శ్యామ్ ప్రసన్నతాంజలి ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన నారాయణ రెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో ఇప్పటి వరకు ఇన్‌చార్జి అనసూయదేవి వ్యవహరించారు. ఉద్యోగోన్నతిలో భాగంగా రేపల్లెలో హిందీ ఉపాధ్యాయినిగా పని చేస్తున్న ప్రసన్నతాంజలి దోర్నాల హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. ప్రసన్నతాంజలికి ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.అదే విధంగా చిన్నదోర్నాల ఉన్నత పాఠశాలకు నూతన ప్రధానోపాధ్యాయుడిగా ఊట్ల కోటేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతరను వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

వైసీపీ పాలనలో ప్రజాధనం దుర్వినియోగం





మార్కాపురంలో సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల, పక్కన సబ్‌కలెక్టర్ త్రివినాగ్
వైపాలెంలో రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

» రేషన్ బండి కోసం పడిగాపులు ఇక ఉండవు
» 15రోజులపాటు సరుకుల పంపిణీ
» చౌక డిపోలను ప్రారంభించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక వాహనాలను పెట్టి సరుకులను అక్రమంగా తరలించి గత వైసీపీ రూ.1,200 కోట్ల మేర ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా రేషన్ దుకాణాలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని 27, 23వ వార్డుల్లోగల రేషన్ దుకాణాలను ప్రారంభించి లబ్ధిదారులకు సరుకులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ సరుకులు అంటూ గత వైసీపీ పాలకులు అక్రమాలకు తెరలేపారన్నారు. ఆ వాహనాలు ఎప్పుడు వస్తాయో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కూలి నాలి చేసుకుని జీవించే వాళ్లు పనులు పోగొట్టుకుని సరుకుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు. ఆ ఇబ్బందులను తప్పించి అక్రమాలను అరికట్టేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, యువనాయకులు లోకేష్ వాహనాలను తొలగించి డీలర్ల వ్యవస్థను పునరుద్ధరించారన్నారు. నెలలో 15 రోజులపాటు నిర్ణీత వేళల్లో ఎప్పుడైనా కార్డుదారులు సరుకులు తెచ్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, తహసీల్దార్ కె.చిరంజీవి, టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : దరిమడుగు గ్రామంలో చౌక ధరల దుకాణాన్ని అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యం, పంచదారను ఆయన అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, టీడీపీ నాయకులు రామాంజులరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, దరిమడుగు నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

తర్లుపాడు : వైసీపీ పాలకులు రేషన్ దుకాణాలకు బండ్లు పెట్టి అక్రమంగా రేషన్ బియ్యాన్ని అమ్ముకునే దందాకు ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని సీతానాగులవరంలో రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి వెలిగొండారెడ్డి, పి.గోపినాథ్, బొంబాయ్ వలి, నరసింహులు, మండల యూత్ అధ్యక్షుడు మేకల వెంకట్ పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : ప్రభుత్వ నూతన విభాగంలో భాగంగా పట్టణంలోని 8వ వార్డులో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని టీడీపీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగిరెడ్డి, పఠాన్ గులాబ్ ఖాన్, ఎం.రమణ, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్, ముస్లిం మైనార్టీ డివిజన్ నాయకుడు మొఘల్ జాబీర్ హుస్సేన్ బేగ్, డీలర్ గొలమారి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పొదిలి : మండలంలోని రేషన్‌షాపులను తహసీల్దార్ క్రిష్ణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. పట్టణంలో అమ్మవారి శాల 22వషాపును ప్రారంభించి బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, వీఆర్వోలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని బ్రిటన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణంలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మధుసూదన్, మార్కెట్‌యార్డు చైర్మన్ బాలయ్య, రూరల్ బ్యాంక్ చైర్మన్ బాలీశ్వరయ్య, కౌన్సిలర్లు లొక్కు రమేష్, బి.చంద్రశేఖర్, భాస్కర్ రెడ్డి, షేక్ పెద్దవలి, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రామనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కంభం : ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ దుకాణాలను తహసీల్దార్ ప్రారంభించి కార్డుదారులకు సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులో రేషన్ దుకాణాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. నూతన రేషన్ కార్డుల మంజూరు, మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియగా అమలు చేయనున్నట్లు తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన రేషన్‌కార్డుదారులకు ఇంటి వద్దకే సరుకులు చేరే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్, ఎంఆర్ఐ గోపి, టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసుల రెడ్డి, మాజీ అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ దండా వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : రేషన్ షాపుల ద్వారానే బియ్యం పంపిణీ జరుగుతందని తహసీల్దారు కిన్నెర శాంతి తెలిపారు. చౌక ధరల దుకాణం వద్ద బియ్యం పంపిణీని తహసీల్దారు కిన్నెర శాంతి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, సుబ్బనారాయణ, జనసేన పార్టీ అధ్యక్షుడు మురళి, డీలర్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులను తహసీల్దార్ కే వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : రేషన్ దుకాణాలను టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎన్‌ఫోర్స్ మెంట్ తహసీల్దారు రాధాకృష్ణ, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ ముఖ్యనాయకులు శ్రీను, మహేష్, చిట్యాల వెంగళరెడ్డి, మంత్రునాయక్, సత్యనారాయణ గౌడ్, మస్తాన్ వలి, సుబ్బారావు, నాగేశ్వరరావు, చేదూరి కిశోర్, ఎంపీటీసీ సభ్యుడు ఎల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

కొమరోలు : తాటిరెడ్డిపల్లి, తాటిచర్ల రేషన్ దుకాణాలను తహసీల్దార్ భాగ్యలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, సైనికుల సంఘ మాజీ అధ్యక్షుడు అంబారపు రామకృష్ణారెడ్డి, వీఆర్వోలు రమణారావు, ఇక్బాల్, డీలర్లు కృష్ణారెడ్డి, భూపాల్ యాదవ్ పాల్గొన్నారు.



గిద్దలూరులో సరుకులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటసుబ్బయ్య



కొమరోలులో రేషన్ సరుకులను అందజేస్తున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి



పొదిలిలో ప్రారంభిస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

6 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

గిద్దలూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం యడవల్లిలో లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ధర్మకర్త ఎం.సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు కె.హరీష్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ శుక్రవారం అంకురార్పణ, ధ్వజారోహణ, గ్రామోత్సవం, 7న స్వామి వారి కల్యాణం, రాత్రికి రామావతారంలో హనుమంత వాహన సేవ, 8న గ్రామోత్సవం, మోహినీ మహావిష్ణు అలంకారాల్లో గరుడ వాహనసేవ, 9న గ్రామోత్సవం, 10న కంపబండి మహోత్సవం, 11న చక్రస్నానం, వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



ర్యాలీని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దోమల నివారణతో రోగాలు దూరం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని దోమలను తరిమేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేందర్‌రెడ్డి అన్నారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా కోర్టు సెంటర్‌లోని అర్బన్ ఆరోగ్య కేంద్రంలో ఆదివారం అవగాహన సదస్సు అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దోమ తెరలు వాడటడం ద్వారా దోమలు కుట్టకుండా జాగ్రత్త పడవచ్చని దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఇజ్రాయిల్, సహాయకులు సత్యనారాయణరాజు, కరీం, భాస్కరరావు, గౌడ్ పాల్గొన్నారు.

లెదర్ టెక్నాలజీపై డీఆర్‌డీఏలో ఉచిత శిక్షణ

కంభం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : లెదర్ టెక్నాలజీపై డీఆర్‌డీఏలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిద్దలూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు, టీడీపీ సీనియర్ నాయకులు ప్రసన్నకుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సిడోస్ లిడ్‌క్యాప్ ద్వారా ఇచ్చే ఉచిత శిక్షణకు అభ్యర్థులు కనీస విద్యార్హత 5వ తరగతి, ఆపై చదివి ఉండాలని, 18-35 సంవత్సరాలు ఉన్న ఎస్సీ కులాల వారు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. లెదర్ స్ట్రిచింగ్, కటింగ్ కోర్సుకు 10వ తరగతి లేదా ఫెయిల్ అయిన వారు అర్హులని, రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటాతోపాటు ఆధార్, కుల, విద్యార్హత, 4 ఫొటోలతో ఒంగోలు భాగ్యనగర్ 4వ లైన్, 11వ అడ్డరోడ్డులోని టిటిడి సెంటర్‌లో సంప్రదించాలని, వివరాలకు 8712190999 సంప్రదించాలన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

తర్లుపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీని తర్లుపాడు పురవీధుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ.. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ మహబూబ్ బాషా, వెంకట కృష్ణారెడ్డి, పాలపర్తి విజేష్‌రాజు, మన్నెం ప్రసన్నరాజు, షేక్ రెహమాన్ బాషా, కొరెంట్ల కోటేశ్వరరావు, కిల్లి వెంకటేశ్వరరెడ్డి, కాకర్లపూడి వేణు, ఇరిగినేని వెంకట నరసయ్య, ఈమన కోటేశ్వరరావు, కె.ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందనలు



టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులతో ఆవోపా సభ్యులు

మార్కాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు ఆదివారం రాత్రి అభినందన సభ జరిగింది. అమ్మవారిశాలలో ఆవోపా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను, తల్లిదండ్రులను జ్ఞాపికలు, శాలువాలతో ఆవోపా సభ్యులు సన్మానించారు. ఆవోపా మార్కాపురం శాఖ అధ్యక్షుడు చీదెళ్ల లక్షణరావు మాట్లాడుతూ ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులను ఆవోపా ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గుడిపాటి వెంకటసుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షులు సూరె వెంకటేశ్వర్లు, సీహెచ్ వెంకటసుబ్బారావు, దేవిశెట్టి రామశేఖర్, కందేపు రంగయ్య, రామకృష్ణ, రాసుబ్బారావు, రామారావు పాల్గొన్నారు.

పొదిలి : 2024- 2025 జేఈఈ మెయిన్స్, ఇంటర్, టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆవోపా ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. జేఈఈ మెయిన్స్‌లో 646 మార్కులు సాధించిన సోమిశెట్టి వెంకటసాయి చక్రి, ఇంటర్‌లో కృష్ణ, నిరంజన్, హిందూజ, టెన్త్‌లో కారంశెట్టి వెంకట ఐశ్వర్య, మహేష్‌సాయి, వెంకటలక్ష్మి, లితేష్ గుప్తాలను ఘనంగా సత్కరించారు. ఆవోపా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈసందర్భంగా అమ్మవారిశాల అధ్యక్షుడు జేసీ సుబ్బారావు, కళాశాల వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, కార్యదర్శి క్రిష్ణమూర్తి, మండల ఆర్యవైశ్య అధ్యక్షుడు మురళి, ఆవోపా అధ్యక్షుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ తిరునాళ్ల

గిద్దలూరు టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముండ్లపాడు గ్రామంలో వెలసిన అంకాలమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం తిరునాళ మహోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మండల టీడీపీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా 6 పండ్ల విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలను సర్పంచ్ కర్నాటి రామసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు చేరెడ్డి జయరామి రెడ్డి ప్రారంభించారు. పాతపాడుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి వృషభాలు 30వేల రూపాయల మొదటి బహుమతిని గెలుచుకోగా ఖాజీపురంకు చెందిన వేగినాటి ఓసూరారెడ్డి వృషభాలు 2వ బహుమతి 25వేలు గెలుచుకున్నాయి. ఆయా కార్యక్రమాలలో టిడిపి నాయకులు శేషగిరి, బొమ్మినేని వెంకటేశ్వర్లు, పఠాన్ సైదుపీరా, షేక్ బాషా, రంగనాయకులు పాల్గొన్నారు.

రేపు యోగాంధ్ర

త్రిపురాంతకం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకంలోని బాలా త్రిపురసుందరీదేవి ఆలయం వద్ద మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. యోగాంధ్ర కార్యక్రమం నోడల్ అధికారిగా ఉన్న మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ ఆదివారం ఈ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమం నిర్వహణపై మండలస్థాయి అధికారులకు సూచనలు ఇచ్చారు. సౌకర్యాలు కల్పించాలన్నారు.

అదుపుతప్పిన పెట్రోల్ ట్యాంకర్

గిద్దలూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు-బేస్తవారపేట రోడ్డులో రంగారెడ్డిపల్లె సమీపంలో అదుపుతప్పి పెట్రోల్ ట్యాంకర్ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నది. రోడ్డుకు అడ్డంగా పెట్రోల్ ట్యాంకర్ నిలబడి పోవడమే కాకుండా ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీకవుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు, నేషనల్ హైవే అధికారులు హుటాహుటీన అక్కడకు చేరుకుని పెట్రోల్ ట్యాంకర్‌ను రోడ్డు పక్క నుంచి తొలగించి పెట్రోల్ లీక్ కాకుండా తాత్కాలిక చర్యలు చేపట్టి మరో ప్రమాదం జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

గిద్దలూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం రంగారెడ్డిపల్లె సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్ దిగి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నది. అదృష్టవశాత్తు కారులో ఉన్న ఎవరికీ ఏమీ జరుగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఏలూరు నుంచి వివిధ దేవస్థానాలు చూసుకుని చివరగా శ్రీశైలం వెళ్తుండగా, కారు డ్రైవర్ నిద్ర మత్తులోకి జారడంతో మార్జిన్ దిగి పొలాల విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నది. అదృష్టవశాత్తు విద్యుత్ స్తంభం ఒరిగిందే తప్ప కారుపై పడకపోవడంతో కారులో ఉన్న వారికి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

రేషన్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- డీసీఎంఎస్ చైర్మన్ కాశిరెడ్డి
- అట్టహాసంగా దుకాణాలు ప్రారంభం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు

వెలిగండ్ల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి అన్నారు. ఆదివారం వెలిగండ్లలో రేషన్ షాపును పునఃప్రారంభించి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్రమంగా సరుకుల పంపిణీ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు నిత్యావసర సరుకులు అందించే రేషన్ షాపులను గత వైసీపీ ప్రభుత్వం మూసివేసిందన్నారు. ఇంటింటికి అందిస్తామని రూ.1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేశారని తెలిపారు. ఇంటింటికి ఇవ్వడం మానేసి నెలలో ఒకటి రెండు రోజులు మాత్రమే ఒకచోట వాహనం నిలిపి ఇవ్వడంతో ఎంతో మంది పేదలు సరుకులు అందక ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. మిగిలిన రేషన్ బియ్యం, సరుకులు అక్రమంగా తరలించారన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రేషన్ షాపుల ద్వారా నిత్యవసరాలు అందించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు కార్యకరమంలో తహసీల్దార్ వాసు, టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, సాన జయపాల్ రెడ్డి, డీలర్ ఆకుల రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ మాఫియాను అరికట్టేందుకే..

దర్శి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యం మాఫియాను అరికట్టేందుకు డీలర్ల వ్యవస్థను పటిష్ఠం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేర్కొన్నారు. దర్శి పట్టణంలో ఆదివారం పలు రేషన్ షాపులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అవలంబించిన అస్తవ్యస్త విధానాలతో రేషన్ బియ్యం పంపిణీ అధ్వానంగా మారిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మాజీ అధ్యక్షుడు యాదగిరి వాసు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు ఇబ్బంది కలిగించొద్దు

పీసీపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపులకు వచ్చే వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని తహసీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పెదఅలవలపాడు, వెంగళాపురం, పోతవరం గ్రామాల్లో ఆదివారం రేషన్‌షాపుల వద్ద లబ్ధిదారులకు ఆమె సరుకులు పంపిణీచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డీలర్లు సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8గంటల వరకు రేషన్‌షాపుల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. ఒకటో తేదీ నుంచి 15 వరకు రేషన్ సరుకులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు ఉన్నారు. కాగా, ప్రభుత్వ ఆదేశాలతో మండలంలో ఉన్న అన్ని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు.

నిబంధనల ప్రకారమే సరుకులు పంపిణీ చేయాలి

పామూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం



దర్శిలో రేషన్ బియ్యం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, పాల్గొన్న మున్సిపాలిటీ చైర్మన్ పిచ్చయ్య తదితరులు

ప్రతి కార్డుదారునికి రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను తహసీల్దార్ బీవీ రమణారావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా పువ్వాడి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడంతో ప్రభుత్వంపై అదనపు భారం పడిందన్నారు. దీనికితోడు పేదలకు దక్కాల్సిన సరుకులను బ్లాక్ మార్కెటింగ్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి



రేషన్ షాపును ప్రారంభించి పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కాశిరెడ్డి

హరిబాబు, షేక్ గౌస్‌బాషా, ఖాజారహంతుల్లా, ఇర్రి కోటిరెడ్డి, బీజేపీ నాయకుడు కేవీ రమణారావు, జనసేన నాయకులు దరిశి ఏడుకొండలు, సందానిబాషా తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని బొట్లగూడూరులో అడుసుమల్లి ప్రభాకర్, కంభాలదిన్నెలో మోపాడు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, మన్నం రమణయ్య, చిలంకూరులో యర్రసింగ్ ముసలయ్య, నుచ్చుపొదలో గోళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు ప్రారంభం

కురిచేడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర వీరాయపాలెం పంచాయతీ పరిధిలోని వెంగాయపాలెం రేషన్ దుకాణంలో ఆదివారం తహసీల్దార్ రజనీకుమారి సరుకుల పంపిణీని ప్రారంభించారు. మండలంలోని 25 రేషన్ షాపుల ద్వారా సరులు పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఎక్కడా అవకతవకలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, వీఆర్వోలు నాగరాజు, ఆంజనేయులు, హనుమంతరావు, రేషన్ షాపు యజమాని పాపారావు, రేషన్ దుకాణాల యూనియన్ అధ్యక్షులు సుంకర గాలిబ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో.. దొనకొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలోని 28 రేషన్ షాపుల్లో ఆదివారం సరుకుల పంపిణీని ప్రారంభించారు. యర్రబాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోడి ఆంజనేయుల పంపిణీని ప్రారంభించారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో రేషన్ దుకాణాలను ఆదివారం తహసీల్దార్ కె.సంజీవరావు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్‌బాబు, ఐ.శ్రీనివాసరెడ్డి, మారం వెంకటరెడ్డి, పిన్నిక రమేష్, కైపు రామకోటిరెడ్డి, నాదెండ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి దేవస్థానంలో డీఎస్పీ పూజలు



నారాయణ స్వామి దేవస్థానంలో పూజలుచేస్తున్న డీఎస్పీ దంపతులు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 1(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈవో నరసింహబాబు ఆలయ సంప్రదాలయతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం డీఎస్పీ కుటుంబసభ్యులను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.సుమన్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగా, శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ రాజగోపురం నుంచి భక్తులు స్వామివార్లకు మహానైవేద్యం సమర్పించారు. గోశాలలోని గోమాతకు పసుపు, కుంకుమతో పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులకు దేవస్థానం తరుపున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి సంబంధించి ఆలయ ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు సమావేశం నిర్వహించి పలు అంశాలను చర్చించారు. త్వరలో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్టు పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ సానికొమ్ము జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కాశిరెడ్డి, మాలపాటి కృష్ణారెడ్డి, బత్తుల శ్రీనివాసరెడ్డి, భైరా వెంకటనారాయణ, మల్లల కాశిరెడ్డి, ఎం.గోపాల్‌రెడ్డి తదితరులు ఈవోను శాలువాతో సన్మానించారు.

ఘనంగా అంకాలమ్మకు పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీఎస్‌పురంలో వెలసిన శ్రీ రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల వేడుకలలో బాగంగా రెండోరోజు ఆదివారం అంకాలమ్మతల్లి జలధి ఉత్సవ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా దేవస్థానం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



రాచూరి పెద్దమ్మతల్లి

భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలి

దర్శి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, నోడల్ ఆఫీసర్ టి.మానస సూచించారు. మండలంలోని బొట్లపాలెం, చెరువుకొమ్ముపాలెం, పోతకమూరు గ్రామాల రైతులతో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అనువైన పంటలను సాగు చేసుకునేందుకు భూసారం, నేల పరిస్థితులను తెలుసుకునేందుకు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే, మండలంలోని రాజంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో శాస్త్రవేత్త, నోడల్ ఆఫీసర్ కె.సంధ్యారాణి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాల్లో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలమురళీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షకులకు సర్టిఫికెట్‌ల అందజేత

తాళ్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో రూట్‌సెట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ ముగిసింది. గత నెల రోజులుగా శిక్షణ పొందిన 35 మందికి ఆదివారం సర్టిఫికెట్‌లను అందజేశారు. కెనరా బ్యాంక్ లీడ్ మేనేజర్ రవికుమార్ శిక్షణ పొందినవారికి అందజేశారు. ఈసందర్భంగా రూట్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శిక్షణలో తర్ఫీదు పొందిన వాటితో జీవిన ప్రమాణాలు పెంచుకునే విధంగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రివేణి, సుదీర్, లీలాకృష్ణ, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు సన్మానం

సీఎస్‌పురం(పామూరు), జూన్ 1(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందినవారిని ఆదివారం మండల ఏపీటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండలంలోని అంబవరం హైస్కూల్ హెచ్‌ఎంగా షేక్ షరీఫ్, డీజీ హెచ్‌ఎంగా పటాన్ మహమ్మద్, అరివేముల హైస్కూల్ హెచ్‌ఎంగా ఒంగోలు వెంకటేశ్వర్లు, శీలంవారిపల్లి హెచ్‌ఎంగా బోడా ప్రసాద్, నల్లమడుగుల, పెదరాజుపాలెం హైస్కూల్‌లకు హెచ్‌ఎంలుగా యస్ చౌడేశ్వరమ్మ, కేశినేని వెంకటేశ్వర్లు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, జేఎస్ ఆనంద్, కె.చెన్నయ్య, కె .రామసుబ్బారావు, పి.మాలకొండయ్య, బి.చిన్ననారాయణ, ఎన్.గంగాధర్, రంగనాయకులు, యోగి రాములు నూతన హెచ్‌ఎంలను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

స్ప్రింక్లర్ల సరఫరా పేరుతో కుచ్చుటోపీ

ఉలవపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, ఉద్యాన రైతులను మైక్రో ఇరిగేషన్ పరికరాలయిన డ్రిప్, స్ప్రింక్లర్స్ సరఫరా చేస్తామని నమ్మపలికిన ఓ వ్యక్తి రైతుల నుంచి సుమారు రూ. 20 లక్షలు వసూలు చేసుకుని పరారయ్యాడు. పీసీపల్లి మండలం, తలకొండపాడుకి చెందిన కూరపాటి నారాయణ నెల్లూరులోని మహేంద్ర డ్రిప్స్ ఇరిగేషన్, సప్లయ్ కంపెనీలో ఉద్యోగినని చెప్పి, నాలుగు నెలల క్రితం స్థానిక విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల(వీఏవోల)ను కలిశాడు. రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ అధికారుల నుంచి గుర్తింపు పొందిన కంపెనీ మహేంద్ర మైక్రో ఇరిగేషన్ అని చెప్పి ఐడీ కార్డు, పే స్లిప్ చూపించి వారిని నమ్మపలికాడు. బిందు సేద్యం కోసం తొలుత ఐదారుగురు మామిడి రైతులు రూ.1,50,000 చెల్లించడంతో డ్రిప్ పరికరాలను సకాలంలో అందచేశాడు. డైరెక్టుగా రైతుల నుంచి తన ఖాతాకు నగదు చెల్లింపులు చేయించుకుని డ్రిప్ పరికరాలను రైతులకు అందించాడు. నమ్మకం కుదిరిన మండలంలోని మరికొందరు రైతులు ఆన్‌లైన్ తమ పేర్లు నమోదు చేయించుకున్నా, నగదు మాత్రం నారాయణ ఖాతాకు పంపారు. మార్చి నెల వరకు అదిగో.. ఇదిగో.. వస్తున్నాయి అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఏప్రిల్ నుంచి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. దీంతో తాము మోసపోయామని రైతులు గ్రహించి లబోదిబోమంటున్నారు. రైతులను మోసగించిన కూరపాటి నారాయణకు, తమ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని, అతను ఓ డీలర్ మాత్రమేనని నెల్లూరులోని మహేంద్ర డ్రిప్స్ ఇరిగేషన్స్ సప్లయ్ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు.

వెన్నుపోటుకు జగన్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్

దర్శి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు విధానాలకు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదలచేశారు. బాబాయిపై గొడ్డలిపోటును ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసి రాష్ట ప్రజలను తప్పుదోవ పట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచి ఇబ్బంది పెడు తున్న ఆయన వ్యవహారశైలి చూసి ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో సాగుతున్న ప్రజారంజక పాలనను చూసి ఓర్చుకోలేని జగన్ వెన్నుపోటు దినం అంటూ నిరసన కార్యక్రమం చేపట్టటం సిగ్గుచేటన్నారు. నవరత్నాల పేరుతో అన్నీవర్గాల ప్రజలను మోసం చేయటంతో గత ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా బుద్ధిరాలేదన్నారు. విద్యార్థులు, యువత, వృద్ధులు, ఉద్యోగస్తులు, అన్నీవర్గాల ప్రజలను దగా చేయటంతో 11 సీట్లకు పరిమి తమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు వాస్తవాలు గమనించి రాష్ట్రాభివృద్ధికి సహకరిం చాలని కోరారు.

వక్రమార్గంలో పయనిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని డాక్టర్ లక్ష్మి హెచ్చరించారు. వైసీపీ కుయుక్తులు, కుట్రలు, వెన్నుపోటు రాజకీయాలను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా తిప్పికొడుతుందన్నారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం

తాళ్లూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వీకే జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు సోమవారం నుంచి తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కొండపల్లి ఆంజనేయులు తెలిపారు. తరగతుల నిర్వహణతో పాటు మధ్యాహ్నభోజన పథకం కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఈఏడాది ఎంపీసీ, సీఈసీ, ఒకేషనల్ కోర్సులకు ప్రవేశాలున్నట్టు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని ప్రిన్సిపాల్ ఆంజనేయులు కోరారు.

కిడ్నీ బాధితుడికి పింఛన్ పంపిణీ

దర్శి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లపాలెం గ్రామానికి చెందిన జి.సామ్యేల్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామ కార్యదర్శి ఆదివారం గుంటూరులోని సదరు ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న సామ్యేల్‌కు పింఛన్ అందజేశారు.

విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం

దొనకొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమైన ఘటన మండలంలోని కలివెలపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాలమేరకు.. గ్రామానికి చెందిన బత్తుల రామిరెడ్డి కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో మంటలు చేలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి ఇంటి తలుపు తాళం పగులకొట్టి మంటలను ఆర్పివేశారు. ఈప్రమాదంలో రూ.2 లక్షల విలువ చేసే గృహోపకరణ వస్తువులు దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పేద రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ సరోజ, వెంకటరెడ్డి, గ్రామస్థులు కోరారు.

మండల ప్రత్యేకాధికారిగా ఈడీ వెంకటేశ్వర్లు

తాళ్లూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండల ప్రత్యేకాధికారిగా జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర్లును నియమిస్తూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. మండల స్థాయిలో జరిగే అభివృద్ధి పనులను పరిశీలిస్తూ అన్నిశాఖలను సమన్వయం చేస్తూ వేగవంతంగా పనులు జరిగేలా చూడాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

నేడు దేవస్థాన భూముల కౌలుకు వేలం

తాళ్లూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తాళ్లూరులోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన 12 ఎకరాల భూమిని మూడు సంవత్సరాలు కౌలుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.వాసుబాబు ఆదివారం తెలిపారు.

సోమవారం దేవస్థానం ఆవరణలో ఉదయం 10.30 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు దేవదాయ, ధర్మాదాయ శాఖ షరతులకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

పాతవిధానంతో ప్రజలకెంతో మేలు..!

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పాత విధానంతో రేషన్ పంపిణీ చేయడంవల్ల ప్రజలకెంతో మేలు చేకూరనుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం దిక్కుమాలిన విధానాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మొబైల్ రేషన్ పంపిణీ వాహనాల ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. కూటమి ప్రభుత్వం పాతవిధానంతో రేషన్ దుకాణాల్లో సరుకులను అందజేస్తుందని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు రేషన్ సరుకులు దుకాణాల్లో అందించటం జరుగుతుందన్నారు. రేషన్ దుకాణాలకు రాలేని వృద్ధులు, దివ్యాం గులకు వారి ఇళ్ల వద్దే రేషన్ సరుకులు అందించటం జరుగుతుంద న్నారు. ప్రభుత్వం ఆయా ఏర్పాట్లను త్వరలో తీసుకోనుందని తెలిపారు.

కార్యక్రమంలో తహసీల్దార్ రవిశం కర్, రేషన్ డీలర్లు, టీడీపీ నేతలు తమ్మినేని శ్రీనివాసు లురెడ్డి, ఫిరోజ్, చిలకపాటి లక్ష్మయ్య, నజీముద్దీన్, బ్రహ్మం, పార్వతమ్మ, ధనలక్ష్మి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ షాపులో సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వైభవంగా పోలేరమ్మ కొలుపులు

- సుదూరప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

తాళ్లూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ తల్లి కొలుపుల ముగింపు కార్యక్రమం వెలుగువారిపాలెం గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పురాతన కాలంలో నిర్మించిన పోలేరమ్మ ఆలయం గ్రామ నడిబొడ్డున ఉండి శిథిలావస్థకు చేరుకోవటంతో పెద్దల నిర్ణయం మేరకు ఐదేళ్ల క్రితం రెడ్డిసాగర్‌కు వెళ్లే మార్గంలో గ్రామ శివారున నూతన ఆలయం నిర్మించి పోలేరమ్మను ప్రతిష్ఠించారు. అయితే, కొలుపులు చేయలేదు. 30 ఏళ్ల క్రితం వరకు వెలుగువారిపాలెం గ్రామంలో పోలేరమ్మ తల్లికి సంప్రదాయబద్ధంగా కొలుపులు నిర్వహించేవారు. గ్రామం, ఈ ప్రాంతం అన్నిరంగాల్లో వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ మే 23 నుంచి జూన్ 1వ తేదీవరకు వరకు పది రోజుల పాటు కొలుపులు ఘనంగా జరిపారు. గత మూడురోజులపాటు ఆచార, సంప్రదాయాల ప్రకారం పోలేరమ్మ తల్లికి శాంతి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులంతా ఐకమత్యంగా కొలుపులు జరుపుకుని బంధువులను పిలవటంతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎంపీపీ తాటికొండ శ్రీను, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర రెడ్డి, బి.ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకున్న పోలేరమ్మ



పొంగళ్లతో వెళుతున్న మహిళలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సీఎస్‌పురం(పామూరు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. 1981- 91 విద్యాసంవత్సరంలో విద్యను అభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుంటూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాల గురించి తెలుసుకొన్నారు. అనంతరం అప్పటి గురువులైన అర్జున ప్రకాష్ రెడ్డి, జె.గోవిందయ్య, ఓ.మాలకొండారెడ్డిలకు పాదాభివందనం చేసి జ్ఞాపికలను అందజేశారు. వారిని ఘనంగా సన్మానించి ఆశీర్వాదం పొందారు. ఆర్థికస్థోమత కలిగిన వారు పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని గురువులు సూచించారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొయిళ్ల నారాయణరెడ్డి, చైతన్యరెడ్డి, షేక్ షంషూర్, సంగిశెట్టి పీరయ్యనాయుడు, తిరుపతయ్య, డేవిడ్, పాలకొల్లు వెంకట్‌రెడ్డి, తోట కనకయ్య, జేఎస్ ఆనంద్, చావా శ్రీనివాసులు, గ్రంధి హేమసుందరం, పోకల మాలకొండయ్య, పాములపాటి మాధవప్రసాద్, కృష్ణహాహన్, వసుంధర, శారద, వసంత తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, జూన్ (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవాని తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరసరాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో సందడిగా మారింది. పలువురు వాహనపూజలు చేయించారు. పూజారులు బాలరాజు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ, అంకాలమ్మ కొలుపులు ప్రారంభం

పామూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చట్టుమడుగు గ్రామంలో వేలసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పల్నాటి వీర్ల అంకాళమ్మతల్లి కొలుపులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా స్వామివార్లకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం అంకాలమ్మ పూజ, గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకులు ముప్పవరపు వంశీయులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

ఉష్ణోగ్రత (అంచనా) 2-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	40	28
బాపట్ల	39	29
రెంటచింతల	40	28
చీరాల	39	29



రైల్వే ప్రాజెక్టులు.. రయ్‌రయ్

- గుంటూరు డివిజన్‌కు రూ.926.53 కోట్లు
- అమరావతి రాజధాని రైలుమార్గానికి నిధులు
- పనులను ముందుకు తీసుకెళ్లేలా నిధులు వచ్చాయంటున్న రైల్వేవర్గాలు

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రాజెక్టులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైల్వే బోర్డు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. మొత్తం ఐదు ప్రాజెక్టులకు రూ.926.53 కోట్ల మంజూరయ్యా యని తేలింది. నిధుల కేటాయింపుతో శరవేగంగా పనులు చేపట్టే అవకాశం ఉందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అమరావతి రాజధానికి నూతన రైలుమార్గాన్ని గత ఎన్‌డీఏ-1 ప్రభుత్వంలోనే కేటాయించింది. అయితే నిధుల కొరతతో దీనిని దాదాపుగా ఎనిమిదేళ్లకుపైగా అటకెక్కించారు. గత సంవత్సరం ఎన్‌డీఏ-3 ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టులో కదలిక ప్రారంభమైంది. ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు అమరావతి మీదగా రైలుమార్గం నిర్మాణానికి రూ.2047 కోట్లతో ప్రాజెక్టుని మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో తొలివిడతగా ఈ ఏడాది రూ.170.80 కోట్లు రైల్వేబోర్డు ఇచ్చింది. దీంతో త్వరితగతిన భూసేకరణని పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించడానికి ఆస్కారం ఏర్పడింది.

- గుంటూరు - బీబీనగర్ రూట్‌లో 100 శాతం పైగా సామర్థ్యంతో రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. 248 కిలోమీటర్ల పొడవునా రెండో రైలుమార్గాన్ని నిర్మించాల్సి ఉన్నది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2853.23 కోట్లు కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రైల్వేబోర్డు రూ.452.36 కోట్లు కేటాయించింది.
- గుంటూరు రైల్వేస్టేషన్ యార్డు రీమోడలింగ్‌ని రూ.120 కోట్లతో రైల్వే శాఖ చేపట్టింది. దీనికి రైల్వేబోర్డు ప్రాధాన్యం కల్పిస్తూ ఈ ఏడాది రూ.71.63 కోట్ల నిధులను విడుదల చేసింది.

నడికుడి - శ్రీకాళహస్తి రైలుమార్గానికి సంబంధించి ఉమ్మడి

- గుంటూరు జిల్లాలో పని ఎప్పుడో పూర్తి అయింది. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో దర్శి నుంచి కనిగిరి వరకు నిర్మాణ పనులు కొనసాగుతున్న పనులకు రూ.170.80 కోట్లు కేటాయించింది. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ మార్గంలో దిగువమెట్ట - నంద్యాలఘాట్ సెక్షన్ పనులకు రూ.148.76 కోట్లు కేటాయించారు.

ఎఫ్‌సీఐ ఏపీసీసీ చైర్మన్‌గా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంప్రదింపుల కమిటీ చైర్మన్‌గా నరసరావుపేట ఎంపీ, పార్లమెంట్‌లో టీడీపీ ఫ్లోర్‌లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు నియమితుల య్యారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎఫ్‌సీఐసీసీ చైర్మన్‌గా ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ఆహార, ధాన్యం సేకరణ, ఇతర పంటల ఉత్పత్తులు, గోడౌన్లలో నిల్వలు, ఆహార పదార్థాల నాణ్యత, రవాణా, స్టోరేజ్ నష్టాలు తదితర అంశాలను పర్యవేక్షిస్తారు. ఏమైనా మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే కేంద్రానికి సిఫార్సులు చేస్తారు. ఈ కమిటీలో ఎంపీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సెక్రటరీ స్థాయి అధికారి, ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్, కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసే నాన్-అఫిషియల్ సభ్యులు ఉంటారు. మెంబర్ సెక్రటరీగా ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ వ్యవహరిస్తారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఈ కమిటీ సమావేశమై చర్చిస్తుంది. ప్రొక్యూర్‌మెంట్, స్టోరేజ్, డిస్ట్రిబ్యూషన్ ఆపరేషన్స్‌ని పర్యవేక్షించే అధికారం ఈ కమిటీకి ఉంటుంది. తిండి గింజల నాణ్యత గురించి ఏమైనా ఫిర్యాదులు వస్తే గిడ్డంగులను తనిఖీ చేయొచ్చు. కాగా ఎంపీ శ్రీకృష్ణదేవరా యలుకు కేంద్రం ఈ పదవి ఇవ్వడంపై టీడీపీ నేతలు, శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

పంట రుణాలు రూ.27,390.14 కోట్లు

సిద్ధమైన వ్యవసాయ ప్రణాళిక

- పంటలన్నింటికీ పెరిగిన పరపతి
- వారం రోజుల్లో ఏరువాక ప్రారంభం
- మిరప పంట ఎకరాకు రూ.1.47 లక్షలు
- వరికి రూ.52 వేలు.. పత్తికి రూ.55 వేలు

వరుణుడి పలకరింపుతో... రైతు పులకరించాడు. సాగుకు సమాయత్తమవుతున్నాడు. మరో వారంలో ఏరువాక రానున్నది. దీంతో ప్రభుత్వం జిల్లాల వారీగా రుణాల లక్ష్యం ప్రకటించింది. ఈ మేరకు తప్పనిసరిగా బ్యాంకర్లు రైతులకు వ్యవసాయ రుణాలు అందజేసి ఆదుకోవాలని ఆదేశించింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో 14.72 లక్షల మంది రైతులకు రుణాలు పంపిణీ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంట రుణాల లక్ష్యం రూ.27,390.14 కోట్లుగా నిర్ధారించారు. ఖరీఫ్, రబీలో పంట రుణాల లక్ష్యాన్ని జిల్లాల వారీగా లీడ్ బ్యాంకు నిర్ణయించింది. సాగు వ్యయం ఏటేటా పెరుగుతున్న నేపథ్యంలో పంటలకు పరపతిని కూడా పెంచారు. దరఖాస్తు చేసిన వెంటనే రుణం మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాల వారీగా లక్ష్యం ఇలా..

జిల్లా	రైతులు	లక్ష్యం(కోట్లలో)
పల్నాడు	6,01,656	10,589.32
బాపట్ల	3,94,041	7,194.69
గుంటూరు	4,76,804	9,606.13



నరసరావుపేట ప్రాంతంలో దుక్కి దున్నుతున్న రైతు

రుణాలు ఇలా..

పంట రకం	మొత్తం (ఎకరాకు)
పసుపు	రూ.22 వేల నుంచి 27 వేలు
మొక్కజొన్న	రూ.45 వేల నుంచి రూ.47 వేలు
పొగాకు(వర్జీనియా)	రూ.లక్ష నుంచి రూ.1.10 లక్షలు
పొగాకు(నాటు)	రూ.42 వేల నుంచి రూ.46 వేలు
కంది	రూ.26 వేల నుంచి రూ.30 వేలు
మినుము	రూ.26 వేల నుంచి రూ.30 వేలు
పెసర	రూ.22 వేల నుంచి రూ.25 వేలు
శనగ	రూ.34 వేల నుంచి 37 వేలు

(నరసరావుపేట, గుంటూరు - ఆంధ్రజ్యోతి)

రుతు పవనాలు విస్తరిస్తున్నాయి. వరుణుడి పలకరింపుతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. ఏరువాక రోజున రైతులు పుడమి తల్లికి పూజలు చేసి రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. పొలాల్లో దుక్కులు దున్నే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోవైపు విత్తన సేకరణలో నిమగ్నమైన రైతులు సాగుకు రుణాల కోసం బ్యాంకులకు దరఖాస్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి. జిల్లాల వారీగా పంటలకు పరపతి పంపిణీ లక్ష్యాలను నిర్ధేశించి లీడ్ బ్యాంకులు ఉత్తర్వులను బ్యాంకులకు జారీ చేశాయి. జూలై 15న సాగునీరు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కౌలు రైతులకు గత ఏడాది కంటే అధికంగా రుణ అర్హత కార్డులు పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అయితే సాగుకు కౌలు రైతులు సిద్ధమవుతున్నా వీరిని గుర్తించే ప్రక్రియ (మిగతా 6వ పేజీలో)



మినీలారీలో తరలిస్తున్న గోవులు

గోవుల తరలింపు అడ్డగింత

- మూడురోజులు సంరక్షించి గోశాలకు అప్పగింత
- దుద్దుకూరు గ్రామస్థులను అభినందించిన గోసంరక్షకులు

ఇంకొల్లు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గోవులను వధించేందుకు వాహనాల్లో పొరుగు రాష్ట్రాలకు తరలించే ప్రయత్నాన్ని ఇంకొల్లు మండలంలోని దుద్దుకూరు గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు.. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో రెండు మినీలారీల్లో సుమారు 30 ఆవుల కాళ్లకు తాళ్లతో బంధించి ఒకదానిపై ఒకటి కుక్కి తరలిస్తున్నారు. అదేసమయంలో ఉపాధిహామీ పనులు పూర్తి చేసుకుని వస్తున్న దుద్దుకూరు గ్రామస్థులు లారీల్లోని గోవులను గమనించారు. 20 గోవులు ఉన్న వాహనం వెళ్లిపోగా మరో వాహనాన్ని అడ్డుకున్నారు. వెనుక కారులో వస్తున్న వ్యాపారి వచ్చి ఆవులను విడిచిపెట్టాలని గ్రామస్థులను కోరారు. అయితే వారు అంగీకరించలేదు. వాహనంలో పదుల సంఖ్యలో గోవులను ఎక్కించడంతో ఓ గోవుకు నడుము విరిగింది. దానికి గ్రామస్థులు సుమారు రూ.6 వేలు ఖర్చు చేసి చికిత్స చేయించారు. ఆ ఆవును గ్రామదేవతకు వదిలేస్తామన్నారు. మిగిలిన 9 గోవులను ఆదివారం రాత్రి ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్ఐ సురేష్‌లు నెల్లూరు జిల్లా కృష్ణపట్నం సమీపంలోని నందవరం గోశాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గోసంరక్షణశాలకు తరలించడంలో ప్రధాన పాత్రదారులైన పాదర్తి హరీష్, అంజియ్య, కంచర్లపల్లి వేణు, వెంకటేష్, గోగినేని నాగేశ్వరరావు, కోటి, చిగురుపాటి వీరాంజి, శేషగిరిరావు, మన్నెం చంద్రకాంత్, వెంకటేశ్వర్లు, పేరం బూచి, ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఎం.శ్రీనివాసరావులను గోశాల నిర్వాహకులు, గోసంరక్షకులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభినందించారు.

తప్పిన తిప్పలు

దుకాణాల వద్దే రేషన్ పంపిణీ

- రేషన్ షాపులకు క్యూ కట్టిన లబ్ధిదారులు
- డోర్ డెలివరీ చిక్కులు తప్పాయంటూ హర్షం
- సరుకులు అందజేసిన ఎమ్మెల్యేలు, అధికారులు



పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెంలో వృద్ధురాలికి రేషన్ సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులు

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తమ వీధికి రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక.. రోడ్డుపై క్యూలో నిల్చోలేక.. బియ్యం అందుతుందా లేదా అన్న ఆందోళనలకు చెక్‌పడింది. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసి పాత విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆదివారం నుంచి రేషన్ సరుకుల పంపిణీని డీలర్ల వద్దే చేపట్టింది. దీంతో లబ్ధిదారులు రేషన్ తిప్పలు తప్పాయన్న ఆనందంతో డీలర్ల దుకాణాల వద్ద క్యూ కట్టారు. ఇక నుంచి తమకు కుదిరినప్పుడు సరుకులు తెచ్చుకోవచ్చని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ నిర్ణయానికి ఆమోదం తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలానికి కార్డుదారులకు కష్టాలు తప్పాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ విధానాన్ని రద్దు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఎట్టకేలకు ఈ నెల ఒకటో తేదీ నుంచి పాత విధానాన్నే అమల్లోకి తెచ్చింది. తొలిరోజే పెద్దసంఖ్యలో కార్డుదారులు షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకు రేషన్ షాపులు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు



వేమూరులో దివ్యాంగురాలికి రేషన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వెళ్లి డీలర్ల వద్దే సరుకులు తెచ్చుకునే వీలు కల్పించారు.

ఎక్కడికక్కడ ప్రారంభించిన ఎమ్మెల్యేలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పునరుద్ధరించిన కార్యక్రమం కావడంతో తొలిరోజు ఆదివారం పలు నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు రేషన్ షాపులకు వెళ్లి సరుకుల పంపిణీని ప్రారంభించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో అధికారులు కూడా ఎక్కడికక్కడ రేషన్ దుకాణాలకు వచ్చిన కార్డుదారులకు స్వయంగా సరుకులు అందజేశారు. గుంటూరులో ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ వసంతరాయపురంలో సరుకుల పంపిణీని ప్రారంభించారు. రేషన్ అక్రమాలను కట్టడి చేయడంలో తొలి అడుగు పడిందని ఈ సందర్భంగా వారు చెప్పారు.

వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే సరుకులు

దివ్యాంగులు, 65 సంవత్సరాలు నిండిన వయోవృద్ధులకు రేషన్ సరుకులను ఇళ్లకు తీసుకువెళ్లి అందించేందుకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎక్కడికక్కడ ఆ బాధ్యత డీలర్లకే అప్పగించారు. అయితే వారు ఎండీయూ వాహనాలు వినియోగించరాదు. ఇలా గుంటూరు జిల్లాలో 67,052 దివ్యాంగులు, వయోవృద్ధుల కార్డులు ఉండగా వారికి ప్రత్యేకంగా సరుకులు అందించేందుకు డీలర్లు సమాయత్తమవుతున్నారు. ఇదేవిధంగా పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కూడా డీలర్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అక్రమ లే అవుట్లపై కదలిక

- జిల్లాలో 22ఏ పరిధిలోకి 86 వెంచర్లు
- అతిక్రమణలపై విచారణకు ఆదేశించిన కలెక్టర్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు విరుద్ధంగా వేసిన వెంచర్లపై ప్రభుత్వంలో కదలిక వచ్చింది. మూడు దఫాలుగా సమీక్షల అనంతరం వాటి విషయంలో ఓ నిర్ణయానికి రాగలిగింది. జిల్లా వ్యాప్తంగా 285 లేఅవుట్లను నిబంధనలకు విరుద్ధంగా వేసినట్లు గతేడాది అక్టోబరులో అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి బహిరంగంగా వాటి పేర్లను ప్రకటించారు. అప్పటి నుంచి వాటిపై ఏం నిర్ణయం తీసుకోవాలనే విషయమై అనేక తర్జనభర్జనల అనంతరం ఇటీవలే అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. ముందుగా 2019 నుంచి వేసిన అనధికారిక లే అవుట్లపై దృష్టి పెట్టి వాటిపై చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా 97 లేఅవుట్లను సబ్‌డివిజన్లగా విభజించి ఆ వివరాలను డీటీసీపీకి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. మరో 86 లేఅవుట్లను 22ఏలో చేర్చి వాటిని రిజిస్ట్రేషన్ చేయడాన్ని నిషేధించాలని సదరు విభాగం కమిషనర్‌కు నివేదించింది. తొలి దశలో భాగంగా మొత్తం 183 లేఅవుట్లపై చర్యల విషయంలో ప్రభుత్వం కదలిక తేగలిగింది.



నిబంధనలకు విరుద్ధంగా బాపట్ల జాతీయ రహదారి పక్కన ఇటీవల వేసిన లే అవుట్(ఫైల్ ఫొటో)

ప్రభుత్వ ఆదేశాలు పట్టవు..

ఓ వైపు అనధికారిక లే అవుట్ల విషయంలో ప్రభుత్వం చర్యలకు దిగుతుంటే మరోవైపు జిల్లాలో నిబంధనలు పాటించకుండా లే అవుట్లు వేసి సొమ్ము చేసుకునే బాగోతం నడుస్తూనే ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించే విధంగా లేఅవుట్లు ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో పలుమార్లు రియల్టర్లకు నిబంధనలపై అవగాహన సదస్సులను నిర్వహించారు. కానీ ఇవేవీ అక్రమార్కులకు పట్టడం లేదు. ముడుపులకు అలవాటు పడిన కొంతమంది ఉద్యోగుల సహకారంతో ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కి మరీ తమ పబ్బం గడుపుకుంటూనే ఉన్నారు. ఇదే విషయాన్ని సాక్షాత్తు కలెక్టర్ వెంకటమురళి ఇటీవల జరిగిన సమీక్ష లో ప్రస్తావించడం వారి బరితెగింపునకు అద్దం పడుతోంది. కొన్ని పంచాయతీల్లో ఇలాంటి ఉల్లంఘనల పర్వం నిరాటంకంగా కొనసాగుతూనే ఉందని, వాటిపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా డీపీవోను కలెక్టర్ ఆదేశించడం గమనార్హం. గత ప్రభుత్వంలో వ్యవస్థలను చెరబట్టి తమ పబ్బం గడుపుకోవడం అలవాటైన కొంతమంది అక్రమార్కులు ఇప్పటికీ తమ పంథా మార్చుకోవడం లేదు. ఈ ఎనిమిది నెలల వ్యవధిలో దాదాపు 18 వరకు అనుమతులు లేకుండా లే అవుట్లు వేసినట్లు ఫిర్యాదులు కలెక్టర్ దృష్టికి వచ్చాయి. పంచాయతీల పరిధిలో కొంత మంది సిబ్బంది అండదండలతోనే ఉల్లంఘనల పర్వం నడుస్తున్నట్లు కలెక్టర్ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

రిజిస్ట్రేషన్ విషయంలో గందరగోళం

అక్రమ లే అవుట్లపై చర్యల విషయంలో వ్యవస్థల మధ్య సమన్వయం లేకపోవడం కూడా అక్రమార్కులకు కలిసి వస్తోంది. ఎనిమిది నెలల క్రితం ప్రభుత్వం అనధికారిక లే అవుట్ల జాబితాను ప్రకటించినప్పుడు వాటి రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ ఆ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. యథావిధిగా వాటి అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటూనే ఉన్నారు. ప్రస్తుతం ప్రకటించిన చర్యల విషయంలో కూడా స్పష్టత లోపించింది. 86 లే అవుట్లను 22ఏ జాబితాలో చేర్చినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ వాటిపై రిజిస్ట్రేషన్ నిలుపుదల విషయంలో తమకెలాంటి సమాచారం లేదని సదరు విభాగం చెబుతోంది. ఇంకో వైపు అనధికారిక లే అవుట్ల విషయంలో ఎల్ఆర్ఎస్ అంశాన్ని పరిశీలించాలని కూడా అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. కానీ విధించే జరిమానాలను ఎవరు భరించాలనే విషయంలో అదే గందరగోళం నడుస్తోంది.

చెల్లింపులకు చిక్కులు

- రైతులను వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు
- గత ప్రభుత్వ హయాంలో లోపాలే.. శాపాలు
- నిర్దేశిత లక్ష్యాలకు దూరంగా నీటి తీరువా వసూళ్లు

అస్తవ్యస్తంగా శిస్తు విధానం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగునీటి రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా పడకేయించింది. ఈ క్రమంలోనే నీటి తీరువా వసూళ్లను కూడా విస్మరించింది. ఆయకట్టు సాగును కంప్యూటరీకరణ చేసే పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసిన హడావిడి ఇప్పుడు నీటి తీరువా చెల్లింపులకు ప్రతిబంధకంగా మారింది. గతంలో నీటి తీరువా శిస్తు చెల్లించినా ఇప్పటికీ బకాయిలు చూపడం ఒక ఎత్తయితే చెల్లించాల్సిన మొత్తాని కన్నా ఆన్‌లైన్‌లో అదనంగా చూపడం వంటి విచిత్రాలు వెలుగులోకి వస్తున్నాయి. 2020 వరకు మాన్యువల్ విధానంలో జరిగే నీటి తీరువా చెల్లింపులను గత ప్రభుత్వం ఆన్‌లైన్ పేరిట ప్రక్రియను అస్తవ్యస్తం చేసింది. శిస్తు చెల్లించడానికి రైతులు సిద్ధంగా ఉన్నా సాంకేతిక చిక్కుల వల్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. నీటి తీరువా వసూళ్లలో ఇప్పటి వరకు 40 శాతం కూడా చేరుకోలేదు. నీటి తీరువా వసూళ్లలో ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా (మిగతా 6వ పేజీలో)

అవీ..ఇవీ..

జనసేన పట్టణ అధ్యక్షుడిగా వహీద్

మార్టూరు, జూన్1(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మార్టూరు పట్టణ అధ్యక్షులుగా షేక్ వహీద్, ప్రధాన కార్యదర్శిగా షేక్ అబ్దుల్ సలాంను నియమించినట్లు పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త పెదపూడి విజయకుమార్ తెలిపారు. ఆదివారం మార్టూరులో జనసేన పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్టూరు పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు మండవాటి కిషోర్, వేముల శ్రీనివాసరావు, సకల ఆంజనేయులు, షేక్ మస్తానవలి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

సంతమాగులూరు జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన అద్దంకి నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై చోటుచేసుకొంది. ముందుగా వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. దీంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే వెల్లెల నుంచి సిమెంట్ లోడుతో వస్తున్న ట్రాలీ ఆటో పుట్టావారిపాలెం జంక్షన్ వద్ద ముందుగా వెళుతున్న బైకును ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న ఇద్దరు వ్యక్తులు బత్తుల బసవయ్య(45), చల్లా శ్రీనివాసరావు(48)లు అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలు తెలుసుకున్న సీఐ వెంకటరావు ఘటనా స్థలాన్ని సందర్శించి క్షతగాత్రులను 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

104 సేవలు ప్రారంభం



వాహన సేవలను ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి విజయమ్మ

చీరాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాలలో ఆదివారం 104 వాహన సేవలను జిల్లా వైద్యాధికారిణి డా.విజయమ్మ ప్రారంభించారు. గతంలో ఈ సర్వీసులు రాష్ట్ర ప్రభుత్వం అరబిందో సంస్థ నిర్వహించింది. అయితే ఈ మార్పుగా ఆ నిర్వహణ భవ్య హెల్త్ సర్వీస్ ప్రొవైడర్ సంస్థ దక్కించుకుంది. ఈ సేవల్లో సర్వీసులు ప్రారంభించిన వైద్యాధికారిణి మాట్లాడుతూ నాణ్యమైన సేవలు ప్రజలకు అందించాలని సూచించారు. ఆమె వెంట నోడల్ అధికారి డా.బ్రహ్మం, 104 జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, ప్రకాష్, డివిజన్ వోజ కృపాసాగర్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ అభివృద్ధికి సహకరించండి



వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు జగదీష్

పంగులూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంఘ అభివృద్ధికి తన తోడ్పాటును అందించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జగదీష్ కోరారు. పంగులూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం రేణంగివరం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. సంఘ నూతన అధ్యక్షుడిగా మల్లెల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా తెప్పెకెపాటి నాగేంద్రప్రసాద్, కోశాధికారిగా రావినూతల శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మునగంటి నరసింహారి, కోశాధికారి మద్దా సుధాకర్, ఉపాధ్యక్షులు మదు, గుంటుపల్లి బ్రహ్మం, బాపూజీ, అద్దంకి పట్టణ సంఘ ప్రతినిధులు శ్రీనివాసరావు, శేషాచారి, అప్పయ్య రామకృష్ణ, కొండమూడి ఆంజనేయులు, ఓంకారిశ్వర పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి నూతన కమిటీ కృషి



ఎన్నికైన నూతన కమిటీ

చీరాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అభివృద్ధి కోసం పాటుపడతామని నూతన కమిటీ ప్రతినిధులు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో పట్టణ అధ్యక్షురాలుగా జి.భవానీ, ప్రధాన కార్యదర్శులుగా మన్నవ సుజాత, గేలి సాయిరాం, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శ్రీనివాసరావు, శివరెడ్డి, కార్యదర్శులుగా నాగలక్ష్మి, ఎల్.శ్రీనివాసరావు, వాసుదేవరావు, ట్రెజరర్‌గా అయ్యప్ప నియమితులయ్యారు. దీంతో సీనియర్ నాయకులు బండారుపల్లి హేమంత్ కుమార్, భరణి తదితరులు అభినందించారు.

ప్రధానోపాధ్యాయులు బదిలీలు

● ఆదివారమే బాధ్యతలు చేపట్టిన హెచ్ఎంలు

చీరాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పలువురు ప్రధానోపాధ్యాయులు బదిలీలు జరిగాయి. ఆయా పాఠశాలల్లో ఆదివారమే బాధ్యతలు చేపట్టారు. దీంతో స్కూళ్ల వద్ద సందడి వాతావరణం నెలకొంది. వేటపాలెం మండల పరిధిలో పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా తలమల దీప్తి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అక్కడ ఉన్న శేఖర్‌బాబు అక్కాయపాలెంకు బదిలీ అయ్యారు. అలాగే వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు దేవరకొండ సరోజిని, కఠారిపాలెం పాఠశాలకు వద్దూపటి బాధ్యతలు చేపట్టారు. అలాకాకుండా చీరాల మండల పరిధిలో గవినివారిపాలెం ఉన్నత పాఠశాలకు శ్రీనివాసరావు, వాడరేవు పాఠశాలకు డి.రత్నకుమారి, జాండ్రపేట పాఠశాలకు రమాదేవి, ఈపూరుపాలెం బాలుర పాఠశాలకు ఏపీఎస్‌సుబ్బారావు, మునిసిపల్ పరిధిలో ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్‌కు సాల్మన్‌రాజు, కేజేఎం గర్ల్స్‌కు వెంకటేశ్వరరావు, ఏఆర్ఎం ఉన్నత పాఠశాలకు కృష్ణ మోహన్‌రావు బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆయా స్కూళ్ల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు



ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ తీగలు

చీరాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ పార్కు పరిధిలోని చెట్లు మధ్యలో విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా ఉన్నాయి. గాలులు, వర్షం కారణంగా తీగల నుంచి మంటలు వస్తున్నాయి. ఈవిధంగా కొన్ని రోజులుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఆదివారం రం మంటలు పెద్దగా వచ్చాయి. ఆ సమయంలో పార్కులోని చిన్నారులు, తల్లిదండ్రులు కొంత భయాందోళనకు గురయ్యారు. దీనిపై అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించకుంటే సమస్యలు ఏర్పడతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ

● పర్యవేక్షించిన అధికారులు ● పాల్గొన్న టీడీపీ నాయకులు ● వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే పంపిణీ



ఈపూరుపాలెం డీలర్‌కు రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న ఆర్డీవో

చీరాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులకు సరుకులు పంపిణీ చేశారు. అందుకు సంబంధించి ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ వేటపాలెం తహసీల్దార్ పార్వతి కి రిజిస్ట్రేషన్ పత్రాన్ని డీలర్లకు అందజేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నిర్దేశించిన సమయాల్లో, గడువు తేదీ వరకు ఎటువంటి అసౌకర్యం లేకుండా రేషన్ పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. దీంతో నియోజకవర్గంలో రేషన్ దుకాణాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంగులూరు : రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ నిర్ణీత వ్యవధిలో విధిగా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. పంగులూరులో ఆదివారం షేక్ కరీమూన్ నిర్వహిస్తున్న దుకాణం వద్ద తహసీల్దార్ సింగారావు రేషన్ పంపిణీ ప్రారంభించారు. అనంతరం కలంవారిపాలెం గ్రామంలో వృద్ధ మహిళకు ఇంటివద్దనే రేషన్ అందించే కార్యక్రమాన్ని పరిశీలించారు. పారదర్శకంగా రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, కుక్కపల్లి ఏడుకొండలు, జాగర్లమూడి సుబ్బారావు(జేకేసీ), గుడిపాటి సుబ్బారెడ్డి, గుడిబండ్ల ఆదిరెడ్డి, డీలర్ రామాం జనేయులు, వడ్డెంపూడి హనుమంతరావు, షేక్ బాజీ, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాసరావు, బాబయ్య పాల్గొన్నారు.

బల్లికురవ : ప్రభుత్వం నూతనంగా రేషన్ దుకాణాల ద్వారా సరుకులను 15 రోజుల పాటు కార్డు దారులందరికి అందజేస్తోందని, తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. ఆదివారం మండలంలోని గుంటుపల్లి, ఉప్పుమాగులూరు, బల్లికురవ గ్రామాలలో రేషన్ సరుకు పంపిణీని తహసీల్దార్ ప్రారంభించారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాలలో డీలర్లు సరుకులు అందిస్తారన్నారు. కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే సరుకులను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, దేవినేని నరేంద్ర, అమరనేని కాశీవిశ్వనాథం, వినోద్, వీరార్జున ఆశోక్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలోని పలు రేషన్ దుకాణాల వద్ద ఆదివారం రేషన్ సరుకులను పంపిణీ చేశారు. తహసీల్దార్ బ్రహ్మయ్య పర్చూరులో జరిగిన రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు.

అద్దంకి : రేషన్‌షాపుల డీలర్ల సమయపాలన పాటిస్తేనే కార్డుదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. అద్దంకి పట్టణంలోని 7వ నంబరు దుకాణం, మండలంలోని బొమ్మనంపాడు, చక్రాయపాలెంలోని రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీని ఆదివారం ఆయన ప్రారంభించారు. రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీతో కార్డుదారులు తమకు వీలున్న సమయంలో సరుకులు తెచ్చుకునే వెసులుబాటు కలిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు పలువురు రేషన్ డీలర్లు ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేశారు. రేషన్‌షాపుల్లో సరుకుల పంపిణీ ప్రారంభించిన తొలిరోజు సర్వర్ సమస్యతో సరుకుల పంపిణీ ఒకింత ఆలస్యం అయ్యింది. రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల కూటమినేతలు పాల్గొన్నారు. బొమ్మనంపాడు, చక్రాయపాలెం లలో సర్పంచ్ గొరంట్ల పద్మావతి, రాయుడు, నేతలు గొరంట్ల శ్రీనివాసరావు, అంజయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అద్దంకి పట్టణంలోని పాత దామావారిపాలెంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, 12వ వార్డులో కౌన్సిలర్ ఆత్తులూరి రమేష్, అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, బొడెంపుడివారి పాలెంలో అద్దంకి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు పిన్నింటి శ్రీదేవి తదితరులు రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభించారు.

చినగంజాం : రేషన్‌పంపిణీ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.ప్రభాకరరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్యలు అన్నారు. మండల పరిధిలోని చినగంజాం, సోపిరాల, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, మున్నంవారిపాలెం తదితర గ్రామాల్లోని చౌకదరాణాలను వారు ఆదివారం ప్రారంభించారు. పెదగంజాం గ్రామంలో తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, సంతరావూరులో జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మిలు ప్రారంభించారు. కడవకుదురు గ్రామంలోని రెండు రేషన్‌షాపులలో సరుకుల పంపిణీని తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ డి.జ్యోతి పరిశీలించారు.

మార్టూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయం ప్రకారం గ్రామాలలో దుకాణాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. మండలంలోని కోలలపూడి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు పంపిణీ ప్రారంభించారు. అదేవిధంగా మార్టూరు గ్రామంలో రామ్‌నగర్ లో మండవాటి అంజయ్యకు చెందిన రేషన్‌షాపు వద్ద, నేతాజీ నగర్‌కు చెందిన గొట్టిపాటి వెంకటాద్రికు చెందిన రేషన్ దుకాణాలలో టీడీపీ నాయకులు ప్రారంభించారు. పలు గ్రామాల్లో రేషన్ దుకాణాలలో పంపిణీ ప్రారంభించారు.







కలంవారిపాలెం గ్రామంలో వృద్ధ మహిళకు ఇంటి వద్దనే రేషన్ అందిస్తున్న అధికారులు, పర్చూరులో రేషన్‌పంపిణీ, అద్దంకిలో సరుకులు అందజేస్తున్న కాకాని అశోక్

గ్రామీణ యువత కబడ్డీపై ఆసక్తిని పెంచుకోవాలి

అసోసియేషన్ చైర్మన్ చంద్రమోహన్‌రెడ్డి



శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు

చినగంజాం, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలోని యువత కబడ్డీపై ఆసక్తి పెంపొందించుకోవాలనేదే వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, అధ్యక్షులు చంద్రమోహన్‌రెడ్డి, కుర్ర బాస్కరరావులు అన్నారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశంజిల్లా కబడ్డీ అసోసియేషన్, బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకల కార్యక్రమం ఆదివారం సాయంత్రం మనంగా నిర్వహించారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ శిక్షణలో క్రీడాకారులకు పౌష్టికాహారం, కబడ్డీ కిట్లు అందించేందుకు దాత డాక్టర్ నల్లూరి సుబ్బారావు లక్ష రూపాయలు అందజేసినట్లు తెలి పారు. కబడ్డీ వేసవి శిక్షణ శిబిరానికి శిక్షకుడిగా ఎం.గిరిబాబు వ్యవహరించారన్నారు. సీనియర్ కబడ్డీ క్రీడాకారులు బి.నాగులుజే యులు, వెంకటేష్, కే.సతీష్, రెడ్డి, బి.శివారెడ్డి, డి.సుబ్బారెడ్డి, వి.వెంకటేష్, జీటీ. అంకిరెడ్డి, ఎం.బాను ప్రకాష్‌రెడ్డిలు నలహాలు, సూచనలు అంద జేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని శిక్షణా శిబిరాలను నిర్వహించ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, సీనియర్ ఉపాధ్యక్షులు సిరిగిరి రంగారావు, డి.రమేష్, అసోసియేషన్ ఆర్థిక దాత డాక్టర్ నల్లూరి సుబ్బారావు, మచిలీపట్నం ఆదనపు పోలీసు అధికారి సత్యం, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, హైదరాబాద్ డీఎస్పీ అన్నా వేణుగోపాల్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్స కోసం రోగుల తరలింపు



బస్సులో ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న రోగులు

పంగులూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శుక్ల మల ఆపరేషన్‌ల నిమిత్తం 76 మందిని ఆదివారం కాకాణి శంకర్ కంటి వైద్యశా లకు తరలించినట్లు రోటరీ ఐ కేర్ రీజనల్ చైర్మన్ వీరరాఘవయ్య తెలిపారు. పంగులూరు రూరల్ శివారు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రోటరీ క్లబ్ శంకర్ కంటి వైద్యశాల వారి సహకారంతో సంయుక్తంగా నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 140 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 76 మందిని ఆదివారం ప్రత్యేక బస్సులో తరలించామన్నారు. మిగిలిన వారికి రెండు రోజుల వ్యవధిలో తరలించి శస్త్రచికిత్స చేస్తామన్నారు. ఈ నెలలో శస్త్రచికిత్స చేయించుకున్న వారికి వచ్చే నెలలో ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. ప్రతి నెలలో ఆఖరి శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వాడరేవు తీరంలో లంగర్ తప్పిన బోటు

● మరో మత్స్యకారుడు గుర్తించి యజమానికి సమాచారం

● బోటు ఖరీదు సుమారు రూ.6 లక్షలు



లంగర్‌వేసి నిలిపిన బోటు

వాడరేవు (చీరాల), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు సముద్రతీరంలో లంగర్ వేసి ఉంచిన బోటు కొట్టుకుపోయింది. ప్రస్తుతం తీరంలో వేట నిషేధిత సమయం. ఈక్రమంలో మత్స్యకారులంతా బోట్లను లంగర్‌లు వేసుకుని భద్రపరచుకున్నారు. కొందరు ఒడ్డుకు చేర్చుకున్నారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన మత్స్యకారుడు గరికిన తాతారావు బోటు ఆదివారం మధ్యాహ్నం లంగర్ తప్పింది. దీంతో కొట్టుకుపోయి విజయలక్ష్మీపురం సమీపంలోని రాళ్లగుట్ట వద్దకు చేరింది. అయితే అప్పటికే యజమాని బోటు కోసం తీరంలో వెదుకులాడారు. ఆ సమయంలో ఆదినారాయణపాలెంకు చెందిన మత్స్యకారుడు గుంటరాజుకు బోటు కంట పడింది. వెంటనే అక్కడే లంగర్ వేసి భద్ర పరిచారు. అంతేకాకుండా బోటు ఫోటోను సోషల్ మాధ్యమం ద్వారా వైరల్ చేయడంతో సమాచారం అందుకొని బోటును స్వాధీనం చేసుకున్నారు. బోటు విలువ సుమారు రూ. 6 లక్షలు ఉంటుందని యజమాని చెప్పారు.

సమాజంలో సమస్యల పరిష్కారం కోసమే కథాసంపుటి

కథారచయిత్రి పాలపర్తి జ్యోతిష్మతి



కథాసంపుటిని ఆవిష్కరిస్తున్న సృజన, రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఆధర్కిటెన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గ్రీన్ లైట్ ఏరియా కథ సంపుటి కథలు ప్రత్యేకమైన శైలిలో నేటి సమాజంలో అనేక సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా సాగుతాయని కథారచయిత్రి పాలపర్తి జ్యోతిష్మతి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక కమలేశ్వర స్వామి ఆలయంలో సృజన, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, అద్దంకి సంయుక్త ఆధ్వర్యంలో గ్రీన్‌లైట్ ఏరియా పుస్తకావిష్కరణ కార్యక్రమ నిర్వహించారు. చొప్పెడి వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కథా సంపుటిని శతపతిని నారాయణ జయశేఖరబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. అనంతరం జబీవుల్ రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం అందుకున్న కథారచయిత వడలి రాధాకృష్ణను రాజకీయ రంగంలో ఎన్‌టీఆర్ జాతీయ కీర్తి పురస్కారాన్ని అందుకున్న నాగినేని రామకృష్ణను, కళారంగంలో పుర స్కారాన్ని అందుకున్న మన్నం త్రిమూర్తులను, సేవా రంగంకు సంబంధించి పురస్కారాన్ని అందుకున్న పెద్ది నేని సురేంద్ర బాబును, రక్తదాన ప్రోత్సాహకులు చందూరి సుధాకరరావులను సృజన, అద్దంకి రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఘనంగా సన్మానించారు. వారిని కె. అనిల్‌కుమార్, నూరి, షేక్ మహమ్మద్ రఫీ, లక్ష్మరాజు, శ్రీనివాస రావు, అద్దంకి లేవిప్రసాద్, పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తిలు సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, కొల్లా అంజయ్య, కొల్లా భువనేశ్వరి, జ్యోతి చంద్రమౌళి, డాక్టర్ బీరం సుందరరావు, కృష్ణమోహన్, సుబ్రహ్మణ్యం, శ్రీరామచంద్రమూర్తి, మస్తాన్, రంగయ్య, రామకోటేశ్వరరావు, శ్రీలక్ష్మి, లక్ష్మిరాజు, శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

చలానాలు పెండింగ్ ఉంటే వాహనం సీజ్

అద్దంకిజూన్1(ఆంధ్రజ్యోతి): వాహనచోదకులకు గతంలో విధించిన అపరాధ రుసుము చలానా లు మూడు కంటే ఎక్కువ పెండింగ్ ఉంటే వాహనాలు సీజ్ చేయటం జరుగుతుందని సీఐ సుబ్బరాజు అన్నారు. అద్దంకి పట్టణంలోని అంబేడ్కర్ బొమ్మ సెంటర్ లో ఆదివారం సాయం త్రం వాహనదారులను ఆపి పెండింగ్ చలానా లు కంప్యూటర్ ద్వారా పరిశీలించారు. పెండింగ్ చలానాలు వెంటనే మీసేవా కేం ద్రాలలో చెల్లించాలన్నారు. ద్విచ క్ర వాహన చోదకులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు.

వసతిగృహాలకు విద్యుత్ ఉపకరణాల అందజేత

పర్చూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి మేరకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలకు పలు గురుకులాలకు, నిధులు విడుదల చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా 195 ఫ్యాన్లు, 195 ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయనున్నారు. ఉపకరణాలు అందజేసిన మంత్రి రవికుమార్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

పంట రుణాలు.. రూ.27,390.14 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఇంకా ప్రారంభం కాలేదు.

వ్యయానికి అనుగుణంగా

ఏటేటా పెరుగుతున్న సాగు వ్యయానికి అనుగుణంగా పంటలకు పరపతిని పెంచారు. పంటల వారీగా ఏ పంటకు ఎంత రుణం మంజూరు చేయాలనేది అధికారులు నిర్ణయించారు. వరి సాగు వ్యయం ఎకరాకు రూ.43,000 అవుతుందని అంచనా వేశారు. దాన్యం దిగుబడి ఎకరాకు రూ.58,000గా నిర్ణయించారు. ఈ మేరకు వరి సాగు ఎకరాకు ఖరీఫ్‌లో రూ.46,000 నుంచి 52,000 రుణం ఇవ్వాలని బ్యాంకులకు లీడ్ బ్యాంకు సూచించింది. రబీలో వరి సాగుకు ఎకరాకు రూ.50 వేలు నుంచి 55 వేలు రుణం మంజూరు చేయనున్నారు. పత్తి ఎకరాకు సాగు వ్యయం రూ.45,500 అవుతుందని అంచనా వేశారు. ఎకరాకు రూ.75,210 విలువైన పత్తి దిగుబడి ఉంటుందని అంచనా వేశారు. పత్తి సాగుకు ఎకరాకు రూ.48 వేలు నుంచి 55 వేలు రుణం ఇవ్వాలని నిర్ణయించారు. బొబ్బర, కాల్వల కింద మిరప సాగుకు వ్యయం రూ.1,47,400, దిగుబడి రూ.3,38,000, వర్షాధార పొలాల్లో వ్యయం రూ.88,500, దిగుబడి రూ.2,00,000 అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు మిరపకు ఎకరాకు రూ.1.50 లక్షల రూ.1.75 లక్షల వరకు రుణం ఇవ్వనున్నట్లు లీడ్ బ్యాంకు ప్రకటించింది.

సాగునీటిపై ఆశలు

● శ్రీశైలానికి 31,425 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

● సకాలంలో నీటి విడుదలకు అవకాశం

రోహిణీకార్తెలోనూ జలాశయాలకు వరద పోటెత్తుతుండటం. కర్ణాటకలో కురుస్తోన్న వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టుకు 37 వేల క్యూసెక్కులకు పైగా వరదనీరు వచ్చి చేరుతుంది. ఇది రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పైగా ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఖరీఫ్ సాగుకు సకాలంలో సాగునీటి విడుదల జరుగుతుందని సాగర్ కుడి కాల్వ, కృష్ణా పశ్చిమ డెల్టా రైతులు ఆశిస్తున్నారు. ఏటా జూలై మొదటి వారంలో కృష్ణా డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తారు. అయితే ఈ సంవత్సరం కొన్ని రోజులు ముందుగానే విడుదల చేసేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతోంది. ఇప్పటికే శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో మొదలైంది. శనివారం ఉదయం ఒక దశలో 70 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో వెళ్లి ఆ తర్వాత మధ్యాహ్నానికి 37,870 క్యూసెక్కులకు తగ్గింది. వరద పెరుగుతుండటంతో విద్యుత్ ఉత్పాదన చేసి 10,176 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు కూడా విడుదల చేశారు. ఆదివారం వరద 31,425 క్యూసెక్కులకు తగ్గుముఖం పట్టడంతో విద్యుత్ ఉత్పాదనను కూడా తగ్గించారు. దీంతో సాగర్‌కు 8,046 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం తుంగభద్ర జలాశయం నుంచి మాత్రమే వరదనీరు వస్తున్నది. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి కూడా వరద వస్తే వేగంగానే శ్రీశైలం నిండి నాగార్జునసాగర్ దిశగా కృష్ణమ్మ ఉరకలేయనున్నది.


చెల్లింపులకు.. చిక్కులు

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో అదేమీ కనబడడం లేదు. శిస్తు చెల్లింపులో అన్నదాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కానీ, సాంకేతిక తప్పులను సవరించడంలో యంత్రాంగం నిర్లక్ష్యం కూడా వసూళ్ల మందకొడిగా సాగడానికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికి వసూలైంది రూ.3.80 కోట్లు

ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకి శిస్తు రూ.200 చెల్లించాలి. కృష్ణా పశ్చిమ డెల్టా కింద మొత్తం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5,58,500 ఎకరాల ఆయకట్టు ఉండగా నీటి తీరువా రూ.29 కోట్లుగా రెవెన్యూ విభాగం చెబుతోంది, ఒక్క బాపట్ల జిల్లాలో చూస్తే ఆయకట్టు 3,80,000 ఎకరాలు కాగా శిస్తు వసూలు లక్ష్యం రూ.20 కోట్లుగా ఉంది. అయితే ఇప్పటి వరకు వసూలైంది రూ.3.80 కోట్లు మాత్రమే. ఇప్పటికే కాలువల మరమ్మతుల పనులకు ప్రభుత్వం రూ.12 కోట్లు నిధులు విడుదల చేసినట్టు అధికారులు చెబుతున్నారు. నీటి తీరువా వసూళ్లతో ఆ పనులకు ఖర్చు పెట్టాలని నిబంధనలు చెబుతున్నా ఖరీఫ్ గడువు ముంచుకొస్తున్నందున తొలుత కాల్వల పనులు జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే నిధులను విడుదల చేసింది. తీరువా వసూలు లక్ష్యాలను చేరుకున్నాక ఆ మొత్తాలను తిరిగి ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం జరుగుతుందని యంత్రాంగం చెబుతోంది.



ఆగిన ఇసుక తవ్వకాలు

- మాన్‌సూన్ సీజన్ ప్రారంభంతో ఫుల్‌స్టాప్
- ఓపెన్ రీచ్‌లు క్లోజ్.. డీసిల్టింగ్ పాయింట్లకే అవకాశం
- ఇకపై యార్డుల్లోనే విక్రయాలు
- తొమ్మిదిచోట్ల 2.34 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక

నెల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు బ్రేకులు పడ్డాయి. మాన్‌సూన్ సీజన్ ప్రారంభం కావడంతో తవ్వకాలు నిలిచాయి. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) నిబంధనల ప్రకారం జూన్ నుంచి సెప్టెంబరు వరకు నదుల్లో తవ్వకాలు జరపకూడదు. దీంతో పెన్నాలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న రీచ్‌లలో ఆపరేషన్లు నిలిపేయాల్సి వచ్చింది. అప్పటి వరకు యార్డుల్లోని ఇసుకను మాత్రమే వినియోగించుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనల కింద డీసిల్టేషన్ పాయింట్లకు మినహాయింపు ఉంది.

● 9 ప్రాంతాల్లో తవ్వకాలు

ప్రస్తుతం జిల్లాలో తొమ్మిది ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అందులో సంగం, సూరాయపాలెం-1, సూరాయపాలెం-2, పోతిరెడ్డిపాలెం పాయింట్ల వద్ద సంగం, పెన్నా బ్యారేజీల ఎగువన బోట్ల ద్వారా ఇసుకను వెలికితీస్తున్నారు. అలానే పల్లిపాడు, మినగల్లు, విరువూరు, అప్పారావుపాలెం, పడమటికంభం పాడు ప్రాంతాల్లో సెమీ మెకనైజ్డ్ ఓపెన్ రీచ్‌లు నడుస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ రీచ్‌ల్లో నేరుగా నదిలో ఇసుక తవ్వకాలు జరిపేవారు. వాహనాలు కూడా నదిలోకి వెళ్లే ఇసుకను లోడ్ చేసుకొని వచ్చేవి. వీటితోపాటు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టడంతో నది పరివాహకంలో అనేక ప్రాంతాల్లో చిన్న చిన్న రీచ్‌లు ఏర్పడ్డాయి. ట్రాక్టర్లు, ఎండ్ల బండ్ల ద్వారా ఇక్కడి నుంచి ఇసుకను తవ్వుకెళుతున్నారు. కోడూరుపాడు, ముదివర్తి, భగత్‌సింగ్‌కాలనీ, పొట్టేపాలెం, తెలుగురాయపురం వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకెళుతున్నారు. ఇలా నదిలో ఓపెన్‌రీచ్‌ల ద్వారానూ, చిన్న చిన్న రీచ్‌ల ద్వారానూ నేరుగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న పాయింట్లలన్నింటినీ మూసి వేయాల్సి ఉంది. ప్రత్యామ్నాయంగా యార్డుల్లో నిల్వ చేసిన ఇసుకనే అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుంది.



సంగం స్టాక్ యార్డులో నిల్వ ఉన్న ఇసుక

అత్యధికంగా సంగంలో నిల్వలు

జిల్లాలో ఉన్న తొమ్మిది స్టాక్‌యార్డుల్లో సుమారు 2.34 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతు న్నాయి. అత్యధికంగా సంగం యార్డులో 99 వేలు క్యూబిక్‌మీటర్లు ఇసుక నిల్వ ఉంది. పోతిరెడ్డిపాలెంలో 40 వేలు, సూరాయపాలెం-1లో 41 వేలు, సూరాయపాలెం-2లో 15 వేలు, అప్పారావుపాలెంలో 20 వేలు, పీకేపాడులో 5 వేలు, పల్లిపాడులో 5600, మినగల్లులో 3 వేలు, విరువూరులో 5 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నాయి. రానున్న నాలుగు నెలలపాటు ఈ యార్డుల నుంచే విక్రయాలు జరుగుతాయి. ప్రస్తుతం జిల్లాలో సరాసరి రోజుకు 4 వేల క్యూబిక్ మీటర్ల వరకూ ఇసుక వినియోగం ఉంటోంది. ఆ లెక్కన చూస్తే జిల్లాలో ఉన్న ఇసుక నిల్వలు రెండు నెలలకు సరిపోతాయి. వాస్తవానికి ముందు నుంచి జిల్లా అధికారులు ఇసుక నిల్వలను పెంచాలని కాంట్రాక్టర్లను ఆదేశిస్తున్నా వారు పట్టించుకోలేదు. ఒక్క సంగం మినహా మిగతా ఎక్కడా కూడా అధికారుల లక్ష్యం మేరకు నిల్వలు ఉంచలేకపోయారు. ఇక వర్షాకాలం రానున్న నేపథ్యంలో అక్టోబరులో కూడా తవ్వకాలు చేయడం అంత సులభం కాదు. ఈ లోపే డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా వీలైనంత ఎక్కువ ఇసుకను నిల్వ చేసుకోవాల్సి ఉంది. కాగా మాన్‌సూన్ సీజన్ ప్రారంభమైనా నదిలో ఇసుక తవ్వకాలు నిలిపివే యాలన్న దానిపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

సోమశిలలో 42.206 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 42.206 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 399 క్యూసెక్కులు వస్తుండగా పెన్నాడెల్టాకు 3,150, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నారు.

పట్టాలపై మృత్యు ఘోష

- రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తుల ఆత్మహత్య
- రైలు ఎక్కుతూ.. ప్లాట్‌ఫారమ్‌పై జరిగే ప్రమాదాల్లో మరికొందరు..
- మిస్టరీగానే బలవన్మరణాలు
- మూడేళ్లలో ప్రాణాలు తీసుకుంది 173 మంది

నెల్లూరు(క్రైం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వారు ఎక్కడ పుట్టారో తెలియదు...ఎందుకు ఆత్మహత్యకు పాల్పడుతున్నారో అంతుపట్టదు... ఇలా ఏడాదిలో ఎంతోమంది రైలు కిందపడి బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అలాగే పట్టాలు దాటుతూనో.. ఆయాస్టేషన్లలో రైలు ఎక్కుతూనో... ప్రమాదాలు జరిగి మృతి చెందుతున్నవారి సంఖ్య కూడా ఇటీవల పెరిగింది. ఇలా మరణించినవారి మృతదేహాలకు ఆయా మున్సిపాలిటీల సిబ్బంది అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో గత మూడేళ్లలో ఇలా మృతి చెందినవారు అక్షరాల 173 మంది. ఒక్క జిల్లాపరిధిలోనే ఇంత మంది ఉంటే ఇక రాష్ట్రంలో, దేశంలో ఇంకెంతమంది ఉంటారో ఊహించుకోవచ్చు.

● మృతదేహం గుర్తించాక..

ఇలా చనిపోయిన వారి సమాచారం అందుకున్న వెంటనే జీఆర్‌పీఎస్ పోలీ సులు సంఘ టనా స్థలానికి చేరుకొని పరిశీలిస్తారు. ఆధారాలు తెలుసుకునేందుకు ఆరా తీస్తారు. చుట్టుప్రక్కల ప్రాం తాల్లో ఆనవాళ్ల కోసం గాలిస్తారు. ఎలాంటి ఆధా రాలు దొరక్క పోతే స్థానికుడి గానే పరిగ ణించి, ఆ ప్రాంతం లోని వీఆర్‌వో లేదా పంచాయతీ కార్యదర్శికి సమా చారం అందిస్తారు. అప్పటికి వివరాలు తెలియకపోతే దేశంలో ఏ ప్రాంతానికి చెందినవారో పరిశీలించి ఓ అవగాహనకు వస్తారు. మృతదేహంపై ఉన్న పుట్టుమ చ్చలు, దుస్తులు, ఇతర గుర్తులను ఫొటోలు తీసి లుక్ అవుట్ నోటీసును స్టేట్, సెంట్రల్ పోర్టల్‌లో పొందు పరుస్తారు. పత్రికలు, సోషల్ మీడియాలో గుర్తుతెలి యని మృతదేహం అంటూ ప్రకటనలు ఇస్తారు.

● మిస్టరీగా మరణాలు

రైలు పట్టాలపై జరిగే ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారు, ఆత్మహత్యలు చేసుకునే వారి కేసులు మిస్టరీగానే మిగులుతున్నాయి. జిల్లాలో మూడేళ్ల కేసులను పరిశీలిస్తే... 2023లో 168 మంది మరణించారు. వారిలో 122 మందిని గుర్తించగా, 46 మందిని గుర్తిం చలేదు. 81 మంది ఆత్మహ త్యలు చేసుకోగా, వారిలో 64 మందిని గుర్తించినగా 17 మంది ఇప్పటికి ఎవరో తెలి యదు. రైలు పట్టాల పక్కన, ప్లాట్‌ఫారంలపై అనారోగ్యంతో మృతి చెందిన వారు 11 మంది కాగా, వారిలో ఐదుగురిని ఇప్పటికీ గుర్తించలేదు. 2024లో 171 మంది మరణించారు. వారిలో 127 మందిని గుర్తించగా, 44 మందిని గుర్తించలేదు. 66 మంది ఆత్మహత్యలు చేసుకోగా, వారిలో 51 మందిని గుర్తించిగా 15 మంది ఇప్పటికి ఎవరో తెలియదు. రైలు పట్టాల పక్కన, ప్లాట్ ఫారంలపై, అనారోగ్యంతో మృతి చెందిన వారు 13 మంది కాగా, వారిలో ఐదుగురిని గుర్తించలేదు. 2025లో మే 16 వరకు తీసుకుంటే రైలు పట్టాలపై జరిగిన ప్రమాదాల్లో 63 మంది మరణించారు. వారిలో 36 మందిని గుర్తించగా, 27 మందిని గుర్తించలేదు. 29 మంది ఆత్మహత్య చేసుకోగా, వారిలో 21 మందిని గుర్తించినగా 8 మంది ఇప్పటికి ఎవరో తెలియదు. రైలు పట్టాల పక్కన, ప్లాట్‌ఫారంలపై అనారోగ్యంతో మృతి చెందిన వారు 10 మంది కాగా వారిలో నలుగురిని గుర్తించగా ఆరుగురికి ఇంకా గుర్తించలేదు.



నెల్లూరు సౌత్ స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసు

మూడు రోజుల తర్వాత పంచనామా

వివరాలు తెలియకపోతే మూడు రోజుల తర్వాత శవపంచనామా నిర్వహిస్తారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తారు. తదుపరి ఆయా మున్సిపాలిటీ అధికారుల అనుమతు లతో మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బందికి అప్పగిస్తారు. మృతుడు ఏమతానికి చెందినవారో గుర్తించి వారి మతాచారాల ప్రకారం అంత్యక్రియలు చేస్తారు.



ఇంటర్ విద్యలో మార్పులు

- నేటి నుంచి జూ. కళాశాలల పునఃప్రారంభం
- జేఈఈ, నీట్, ఏపీ ఈఏపీ సెట్‌కు ప్రత్యేక శిక్షణ
- ప్రశ్నపత్రం నమూనా విడుదల

నెల్లూరు(విద్య), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో ఈ ఏడాది నుంచి కొత్త విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నాది. నీట్, జేఈఈ, ఈఏపీ సెట్‌కు విద్యార్థులను సన్నద్ధం చేసేలా సిలబస్‌లో మార్పులు చేసింది. ఈ మేరకు సిలబస్, ప్రశ్నపత్రాల కూర్పు, అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్‌బోర్డు విడుదల చేసింది. తొలివిడతగా ఏప్రిల్ 1 నుంచి 24 వరకు తరగతులు నిర్వహించి, 25 నుంచి జూన్ ఒకటి వరకు సెలవులు ఇచ్చారు. తిరిగి జూన్ 2 (సోమవారం) నుంచి తరగతులను ప్రారంభిస్తున్నారు. అకడమిక్ క్యాలెండర్‌లో 314 రోజులకు గాను 235 పనిదినాలు, 79 సెలవు దినాలను ప్రకటిస్తూ షెడ్యూల్ విడుదల చేశారు.

● పాఠ్య పుస్తకాల పంపిణీ

ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి జిల్లాకు 1,19,724 నోట్‌పుస్తకాలు, 11,600 పాఠ్యపుస్తకాలు చేరాయి. వీటిని జిల్లాలోని అన్ని కళాశాలలకు పంపిణీ చేశారు. అలాగే ప్రథమ సంవత్సరంలో చేరేందుకు కూడా గత నెల నుంచే ప్రవేశాలు ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాలలన్నింటిలోనూ మధ్యాహ్నం భోజనం అమలు చేయనున్నారు.

● సిలబస్ మార్పు

ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రథమ సంవత్సరం సబ్జెక్ట్‌ల్లో కొత్త సిలబస్‌ను రూపొందించారు. ప్రథమ, ద్వితీయ భాషలతోపాటు ప్రస్తుతం ఉన్న 4 సబ్జెక్టులు సైన్స్ 5 సబ్జెక్టల ఆర్ట్స్ విభాగాల వ్యవస్థను ప్రక్షాళన చేసి నూతనంగా ఎంబైపీసీని ప్రవేశపెట్టారు. అలాగే ప్రథమభాషగా ఇంగ్లిష్‌ను అందరికీ వర్తింప చేశారు. ద్వితీయభాష కోసం ప్రస్తుతం ఉన్న పది భాషల స్థానంలో అదనంగా సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల్లో మరో 14 సబ్జెక్ట్‌లను ప్రతిపాదించారు.గ్రూపు సబ్జెక్ట్‌ల విభాగానికి వస్తే ఎంపీసీ గ్రూపు విద్యార్థులు అదనంగా బయాలజీని, బైపీసీ వారు అదనంగా మ్యాథ్స్‌ను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు.

● షెడ్యూల్ ఇలా...

ఈ ఏడాది జూన్ 2న కళాశాలలు ప్రారంభించి జూలై 17 నుంచి 19 వరకు యూనిట్-1 పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు 18 నుంచి 20 వరకు యూనిట్-2 పరీక్షలు, సెప్టెంబరు 15 నుంచి 20 వరకు క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5వరకు దసరా సెలవులు, అక్టోబరు 22 నుంచి 24 వరకు యూనిట్-3 పరీక్షలు, నవంబరు 17 నుంచి 22 వరకు అర్ధ సంవత్సరం పరీక్షలు, జనవరి 15 నుంచి 20వరకు ప్రీఫైనల్-1 పరీక్షలుంటాయి. జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు, జనవరి 21 నుంచి 28వరకు ప్రీఫైనల్-2, ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, ఫిబ్రవరి చివరి నుంచి మార్చిలో థియరీ పరీక్షలు నిర్వహిస్తారు. మార్చి 18న అకడమిక్ సంవత్సరాన్ని ముగించనున్నారు.

● ప్రశ్నపత్రాల్లో మార్పులు.

ఈ ఏడాది నుంచి ప్రశ్నపత్రాల కూర్పులో మార్పులు చేశారు. మ్యాథ్స్‌-ఏ, బీలుగా ఉన్న రెండు పేపర్లను కలిపి ఒకే పేపర్‌గా, బోటనీ, జువాలజీలను కలిపి బయాలజీ పేపర్‌గా మార్పు చేస్తున్నారు. వీటితోపాటు ఆయా సబ్జెక్ట్‌లలోని మార్కులను పునర్విభజన చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2, 4, 8 మార్కుల విధానాన్ని కొనసాగిస్తూనే ప్రతి సబ్జెక్ట్‌లో దాదాపు 10శాతం ఒక్క మార్కుల ప్రశ్నలు ఉండేలా ప్రశ్నపత్రాన్ని రూపొందించను న్నారు. గతంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉన్న 7 పీరియడ్ల విధానా నికి స్వస్తి పలికారు. అన్ని జూనియర్ కళాశాలలు కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఒక్కో పీరియడ్ 50 నిమిషాల చొప్పున 8 పీరియడ్లు ఉండేలా మార్పులు చేశారు.

నూతన పద్ధతుల్లో ఇంటర్



ఇంటర్‌లో అభ్యసనా సామర్థ్యాలను పెంచడంతోపాటు జాతీయస్థాయి ప్రమాణాలతో ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకే సంస్కరణలు రూపొందించారు. కోరుకున్న సబ్జెక్టలను ఎంపిక చేసుకోవడం, అనవసర విషయాలను తగ్గించుకోవడం, విద్యార్థులను ఉన్నతవిద్య, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

- టీ.వరప్రసాదరావు, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి

క్షీణిస్తున్న ధరలు

- రోజురోజుకి పడిపోతున్న పొగాకు సరాసరి రేట్లు
- మీడియం గ్రేడ్లలోనూ కోత
- మే ముగిసినా 25 శాతం కూడా సాగని అమ్మకాలు
- రంగుమారుతున్న ఆకుతో రైతుల ఆందోళన

కందుకూరు, జూన్1(ఆంధ్రజ్యోతి): పొగాకు ధరలు రోజు రోజుకు దిగజారుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోపక్క నోబిడ్‌లు, సీఆర్(కంపెనీ రిటర్న్)లు పెద్దసంఖ్యలో ఉంటూ వేలంలోనూ విపరీతమైన జాప్యం జరుగుతోంది. ఒంగోలు రీజియన్ పరిధిలో అంచనా ఉత్పత్తిలో 25 శాతం అమ్మకాలు కూడా నేటికీ పూర్తికాలేదు. ఇదేరీతిలో వేలం జరిగితే అమ్మకాలు పూర్తవ్వాలంటే మరో ఏడునెలలు పడుతుందని బోర్డు అధికారులు పేర్కొన్నారు. ఇళ్లలో, గోదాముల్లో నిల్వచేసుకున్న పొగాకు రంగుమారిపోవటం ప్రారంభమైనందున తీవ్రంగా నష్టపోక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● తగ్గిన సరాసరి ధర

గత ఏడాది వేలం పూర్తయ్యే సమయానికి దాదాపు అన్ని కేంద్రాల లోను సరాసరి ధర క్వింటాల్‌కు రూ. 27వేలుగా ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు లోగ్రేడ్‌ల అమ్మకాలు ప్రారంభం కాకపోయినా, సరాసరి ధర క్వింటాల్‌కు రూ. 2వేలు నుంచి రూ. 3వేలు వరకు తగ్గిపోయింది. కందుకూరు 2 వేలం కేంద్రంలో శనివారం సరాసరి ధర రూ. 25,611 లభించగా, కందు కూరు 1లో క్వింటాల్‌కు 24,587 ధర దక్కింది. అలాగే కలిగిరిలో సరా సరి ధర రూ. 25,151 లభించగా డీసీ పల్లిలో రూ. 23,288 మాత్రమే దక్కింది.



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వేలంలో జాప్యం



ఈ ఏడాది 450 క్వింటాళ్ల పొగాకు పండించగా ఇప్పటివరకు 100 క్వింటాళ్లు మాత్రమే అమ్ముకోగలిగా. వేలంలో జాప్యం వల్ల ఆకు నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉంది. వేలంను వేగవంతం చేయటంతోపాటు ధరలు దిగజారకుండా చర్యలు తీసుకోవాలి. లోగ్రేడ్‌ను పొగాకు సమాఖ్య ద్వారా కొనుగోలు చేయిస్తే మిగిలిన గ్రేడ్‌ల కోసం వ్యాపారులు పోటీపడి ధరలు తగ్గకుండా నిలిచే అవకాశం ఉంది.

- తోకల సుబ్బారావు, రైతు, పెదమోపాడు

ఎక్కడివారు అక్కడే !

● సాంఘిక సంక్షేమశాఖలో బదిలీల ఫైల్ వెనక్కు...



నెల్లూరు(హరనాథపురం), జూన్ 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా సాంఘిక సంక్షేమశాఖలో గుట్టుచప్పుడు కాకుండా బదిలీలు నిర్వహించటంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఖాళీలను బహిరంగ పరిచి, ఐదేళ్ల పూర్తి చేసుకున్న వారికి బదిలీలు నిర్వహించాల్సి ఉండగా, అలా జరగలేదనే విమర్శలు వెల్లువెత్తుతుతున్నాయి. ఉద్యోగ సంఘాల నేతలుగా చలామణి అవుతున్న కొందరు హాస్టల్ వార్డెన్ల ఇష్టానుసారంగా ఈ బదిలీలను పూర్తి చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపినట్లు తెలిసింది. ఈ ఫైల్‌ను డీఆర్వో పరిశీలించి సమగ్ర సమాచారంతో పంపాలని వెనక్కి పంపినట్లు సమాచారం. యూనియన్ నాయకులుగా కొనసాగుతున్న కొందరు 11 నుంచి 14 ఏళ్లుగా ఒకే స్థానంలో పనిచేస్తున్నారు. వారిని కచ్చితంగా బదిలీ చేయాల్సి ఉంది. కాని బదిలీ చేయకుండా అక్కడే కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఉద్యోగుల బదిలీలకు ఇంకా గడువు ఉంది.అయితే ఇక ఆ శాఖలో ఏం జరగబోతుందో వేచి చూడాలి.

డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరా పేరుతో

కుచ్చుటోపీ

- రైతులను మోసం చేసిన మైక్రో ఇరిగేషన్ కంపెనీ ఉద్యోగి
- అతనితో మాకు సంబంధం లేదంటున్న యాజమాన్యం
- ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారుల ప్రోద్బలంతో నగదు బదిలీ
- కేసుల నమోదుకు అన్నదాతల సన్నద్ధం





ఉలవపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, ఉద్యాన రైతులను మైక్రో ఇరిగేషన్ పరికరాలయిన డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరా చేస్తామని నమ్మపలికిన ఓ వ్యక్తి రైతుల నుంచి సుమారు రూ. 20 లక్షలు వసూలు చేసుకుని పరారయ్యాడు. నెలలు గడుస్తున్నా ఆ వ్యక్తి నుంచి సమాధానం లేకపోవడంతో రైతులు తాము మోసపోయామని గ్రహించి, అతనిపై కేసు నమోదుకు సన్నద్ధమవుతున్నారు. వివరాల్లోకి వెళితే...

ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం, తలకొండపాడుకి చెందిన కూరపాటి నారాయణ నెల్లూరులోని మహేంద్ర డ్రిప్స్ ఇరిగేషన్, సప్లయ్ కంపెనీలో ఉద్యోగినని చెప్పి, నాలుగు నెలల క్రితం స్థానిక విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల (వీఏవోల)ను కలిశాడు. రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ అధికారుల నుంచి గుర్తింపు పొందిన కంపెనీ మహేంద్ర మైక్రో ఇరిగేషన్ అని చెప్పి ఐడీ కార్డు, పే స్లిప్ చూపించి వారిని నమ్మపలికాడు. అంతేకాకుండా వలేటివారిపాలెం, లింగసముద్రం, పొన్నలూరు మండలాల రైతులకు డ్రిప్స్, స్ప్రింక్లర్స్ సరఫరా చేశానని, అక్కడి వీఏవోలతో మాట్లాడించాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇరిగేషన్ పరికరాలపై 50 శాతం రాయితీని అందిస్తున్నదని, మండలంలోని ఉలవపాడు, ఆత్మకూరు, భీమవరం, రాజుపాలెం, చాగొల్లు గ్రామాలకు చెందిన రైతులు 22 మంది నుంచి స్ప్రింక్లర్ల కోసం వీఏవోల లాగిన్‌లో స్ప్రింక్లర్ల పైపులు, డ్రిప్ పరికరాలను నమోదు చేయించుకున్నాడు. ఒక్కొక్క పైపు 20 అడుగుల చొప్పున ఒక సెట్‌లో 31 స్ప్రింక్లర్లు పైపులు ఉంటాయి వాటి ఖరీదు రూ. 13,000, కాగా 20 అడుగుల చొప్పున ఒక సెట్‌లో 40 స్ప్రింక్లర్స్ నల్ల పైపులు ఉంటాయి. వాటి ఖరీదు రూ.18,000 ఉంటుంది. ఈ లెక్కన 22 మంది రైతుల్లో కొందరు రెండు, మూడు సెట్ల పైపులకు నగదు చెల్లించారు.

● నమ్మకం కోసం డ్రిప్ అందజేత

బిందు సేద్యం కోసం తొలుత ఐదారుగురు మామిడి రైతులు రూ.1,50,000 చెల్లించడంతో డ్రిప్ పరికరాలను సకాలంలో అందచేశాడు. నగదు కూడా మైక్రో ఇరిగేషన్ పీడీ ఖాతా నుంచి గుర్తింపు పొందిన ఆయా కంపెనీలకు చెల్లింపులు జరగాల్సి ఉంది. అయితే నారాయణ డైరెక్టుగా రైతుల నుంచి తన ఖాతాకు నగదు చెల్లింపులు చేయించుకుని డ్రిప్ పరికరాలను రైతులకు అందించాడు. దీంతో నమ్మకం కుదిరిన మండలంలోని మరికొందరు రైతులు ఆన్‌లైన్ తమ పేర్లు నమోదు చేయించుకున్నా, నగదు మాత్రం నారాయణ ఖాతాకు పంపారు. మార్చి నెల వరకు అదిగో.. ఇదిగో... వస్తున్నాయి అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఏప్రిల్ నుంచి ఫోన్ స్విచ్ఛాప్ చేశాడు. దీంతో తాము మోసపోయామని రైతులు గ్రహించి లబోదిబోమంటున్నారు.

● కంపెనీతో ఆయనకు సంబంధం లేదు..

రైతులను మోసగించిన కూరపాటి నారాయణకు, తమ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని, అతను ఓ డీలర్ మాత్రమేనని నెల్లూరులోని మహేంద్ర డ్రిప్స్ ఇరిగేషన్స్ సప్లయ్ కంపెనీ ప్రతిని ధులు పేర్కొన్నారు. అయితే ఆ కంపెనీ మాట మారుస్తున్నదని రైతులు, రైతుసేవా కేంద్రం ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అయితే కంపెనీ తరుపున మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ శ్రీహరి తమ పొలాలకు వచ్చి ఎస్టిమేషన్ వేశారని, ఇప్పుడు నారాయణతో సంబంధాలు లేవంటే ఎలాగని రైతులు నిలదీ స్తున్నారు.

● పక్క మండలాల్లోనూ ఇదే మోసం

ఉలవపాడు మండలంతోపాటు లింగసముద్రం, కందుకూరు, వలేటి వారిపాలెం మండలాల్లో కూడా రైతులకు ఇదే తరహాలో నారాయణ మోసం చేశాడని సమాచారం. మొత్తం మీద నాలుగు మండలాల్లో సుమారు రూ. 20 లక్షలు సొమ్ముతో పరారైనట్లు రైతులు చెబుతున్నారు. మోసపోయిన రైతులు ఆదివారం పోలీసులను ఆశ్రయించగా, విచారించి కేసు నమోదు చేస్తామని వారు పేర్కొన్నారు.

మాకు ఎలాంటి సంబంధం లేదు

ఉలవపాడు మండలం ఆత్మకూరుకి చెందిన రైతులు ఈ విషయమై తమను సంప్రదించారని మండల ఉద్యానశాఖ అధికారి వీ. జ్యోతి తెలిపారు. తాను రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ అధికారులను సంప్రదిస్తే నారాయణ అనే పేరు తమ వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని వారు పేర్కొన్నారని ఆమె వివరించారు. రైతులు మోసపోయిన విషయంలో తమ శాఖకు ఎలాంటి సంబంధం లేదని ఆమె పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100): 525	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9188
వెండి కిలో ధర	రూ. 99,600
వెండి ఒక గ్రాము	రూ.102.60

వైభవంగా అభయాంజనేయుడి పుష్కరిణి వార్షికోత్సవం

అల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు కోనేరు సెంటరులోని అభయాంజనేయస్వామి పుష్కరిణి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వాహకులు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం కోనేరు సెంటరు నుంచి ఇస్కపల్లి తూముల వరకు కాషాయం జెండాలు చేతబూని శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి వేషధారణతో ఆకట్టుకున్నారు.

సమైక్య ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలి : ఏఐటీయూసీ

కందుకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పాలకుల విధానాలపై కార్మికులు సమైక్య ఉద్యమాలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్కే జిలానీఖాన్ కోరారు. ఏఐటీయూసీ నియోజకవర్గ మహాసభ సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ మహాసభలో జిలానీఖాన్ మాట్లాడుతూ కార్మికుల చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదన్నారు. కే. మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ నాయకులు పీ మాలకొండయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె. రమణమ్మ, పీ. బాలకోటయ్య, ఎస్కే. హుస్సేన్, వై. ఆనంద్‌మోహన్, ఎస్. రామారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 21మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బీ సురేష్‌బాబు, అధ్యక్షుడిగా మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వై. ఆనంద్ మోహన్‌లను ఎన్నుకున్నారు.

పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు

గుడ్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో మండలంలో 500 మార్కులకు పైగా సాధించిన, అన్ని పాఠశాలల విద్యార్థులకు గుడ్లూరు యశ్వంత్ సాయితేజ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వ ర్యలో నగదు బహుమతులు ఆదివారం అందజేశారు. స్థానిక అభ్యుదయ పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి అతిథులుగా సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ హాజరై మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇంటర్‌మీడియట్‌లో కూడా రాణించాలన్నారు.

జనసేన కార్యకర్తలకు కిట్ల పంపిణీ

అల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్కసీటు గెలవకపోయినా పదేళ్ల పార్టీని నడిపి నిలబెట్టిన నాయకుడు జన సేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అని ఆ పార్టీ కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అన్నారు. అల్లూరులో ఆదివారం నిర్వహించిన క్రియాశీలక కార్యకర్తలకు కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అల్లూరు ప్రధాన రహదారిలో బైక్ ర్యాలీ చేపట్టిన అనంతరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కార్యకర్తలు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కారుమంచి కార్తీక్ శర్మ, పబ్బా సాయి విఠల్, లక్ష్మీ, కోఆర్డినేటర్ బాలు, బెల్లంకొండ మస్తాన్, కావలి టౌన్ ఉపాధ్యక్షుడు నాగార్జున, బుర్రి మల్లికార్జున పాల్గొన్నారు.

షుగర్, బీపీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ప్రముఖ వైద్యనిపుణులు ఎంవీ రమణయ్య, గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం బాలకృష్ణ తెలిపారు. స్థానిక షిరిడి సాయిరామ్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం వారి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఆహార అలవాట్లు క్రమబద్ధీకరించుకుని, యోగా, వాకింగ్ తదితర వ్యాయా మాలు చేయడం దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలన్నారు. అనంతరం రోగులను పరీక్షించి ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సంధాని, జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్ మురళీకృష్ణ, కృష్ణమోహన్, హరికృష్ణ, పలువురు ఉపాధ్యాయులు, ఎల్‌ఆర్‌పల్లి పాఠశాల విద్యార్థులు పాల్గొని రోగులకు సేవలందించారు.

90శాతం రాయితీతో సంక్షేమ పథకాలు అందించాలి

మర్రిపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వడ్డెర కార్పొరేషన్ ద్వారా 90శాతం సబ్సీడీతో సంక్షేమ పథ కాలు అందించాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ గంజి దయాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వడ్డెర సంగం మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వడ్డెర మహిళలపై, చిన్నారులపై వడ్డెర వృత్తిదారులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, తమకు అట్రాసిటీ ప్రత్యేక చట్టాన్ని ప్రభుత్వం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు బీ.రత్నయ్య, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డు సబ్‌స్టేషన్ నుంచి శ్రీనగర్‌కాలనీకి వెళ్లే 11కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించడం కోసం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహ తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి, అధికారులకు సహకరించాలని కోరారు.



అల్లూరు: రేషన్ సరుకుల పంపిణీని పునఃప్రారంభిస్తున్న బీద గిరిధర్, తహసీల్దారు లక్ష్మీ నారాయణ, తదితరులు



లింగసముద్రం: వీఆర్ కోటలో రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు



ఆత్మకూరులోని ఓ చౌకదుకాణం వద్ద రేషన్ అందజేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి తదితరులు

నాణ్యమైన నిత్యావసర సరుకుల పంపిణీయే లక్ష్యం

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందించాలనే ప్రభుత్వం రేషన్‌దుకాణాలను పునఃప్రారంభించినట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వైకుంఠపురంలోని 29వ రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మొబైల్‌వాహనాల ద్వారా రేషన్ సరుకులు పక్కదారి పట్టాయన్నారు. ప్రస్తుతం 15 రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని లబ్ధిదారులు ఎప్పుడైనా వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే డీలర్లు సరుకులు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీ శ్రావణ్‌కుమార్, పౌరసరఫరాల ఉప తహసీల్దార్ విజయమ్మ, టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబూరావు, మంచాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : స్థానిక 34, 5, 1, 2 నెంబర్ల రేషన్‌షాపుల్లో ఆదివారం చేపట్టిన సరుకుల పంపిణీ కార్యక్రమాలకు టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు, సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీ పనులకు వెళ్లే పేదలు ప్రతీనెలా 15 లోపు రేషన్ సరుకులు పొందే అవకాశం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, సామంతుల పరంధామి రెడ్డి, నజీర్ బాషా, మంగిశెట్టి సురేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : రేషన్ దుకాణాల వద్దనే సరుకులు పంపిణీ కార్యక్రమం ఆదివారం మండలంలోని అన్ని దుకాణాలలో ప్రారంభమైంది. మండల పరిధిలో 36 రేషన్ దుకాణాలలో సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు. వికలాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే సరుకులు అందచేయడం జరుగుతుందన్నారు. గుడవల్లూరు షాపునెంబరు 2లో సరుకుల పంపిణీలో తహసీల్దార్ కోటేశ్వరరావు, భీమవరప్పాడు షాపునెంబరు 16లో టీడీపీ నాయకులు గురుదేవ్ శ్రీనివాస్, గొట్టిపాటి మాలకొండయ్య, డీలర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



కొండాపురం: భీమవరప్పాడులో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న డీలర్ సంధ్య తదితరులు



కావలి: లబ్ధిదారుడికి బియ్యం అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, పక్కన తహసీల్దార్ తదితరులు

లింగసముద్రం, మండలంలోని 27 రేషన్ దుకాణాల ద్వారా ఆదివారం లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు డీలర్ల ద్వారా బియ్యం, కందిపప్పు, చక్కెర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎం రమణయ్య, వీఆర్‌ఓ పఠాన్ అమానుల్లాఖాన్, టీడీపీ నేతలు వంకాయలపాటి మాల్యాద్రి, బోయిళ్ల కొండపనాయుడు, పొంకం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు పండుగ వాతావర ణంలో ఆదివారం చౌకదుకాణాల్లో ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని పలు చౌకదుకాణాలను టీడీపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు పర్యవేక్షిస్తూ ప్రజలకు సక్రమంగా సరుకులు అందేలా దృష్టి సారించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్య స్తంగా మారిందన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి సరుకులు అందించడంలో విఫలమయ్యార న్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టడానికి కూడా ఎండీయూ వాహనాలే ప్రధాన కారణమనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ పాత విధానంలోనే డీలర్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి తోడేటి వెంకటయ్య, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చేజర్ల: కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పాత విధానంలోనే ఆదివారం రేషన్ దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేపట్టారు. గతంలో రేషన్ బండి ఎప్పుడు వస్తుందో తెలియదు, ఒక వేళ వచ్చినా ఎక్కడో సందు చివరన పెడితే అక్కడకు వెళ్లి సరుకులు తీసుకోవాలి. ఒక వేళ బండి వచ్చే సమయంలో బయటకు వెళ్లి ఉంటే ఇక సరుకులు లేనట్లే. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి రేషన్ దుకాణాల సరుకులు పంపిణీ చేయడంతో పాటు, సమయాలు కూడా ఏర్పాటు చేయడంతో కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 36 రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ ప్రారంభించినట్లు సివిల్‌సప్లైస్ డీటీ రవి తెలిపారు.

సంగం: మండలంలోని అన్ని రేషన్ దుకాణాల్లో డీలర్లు లబ్ధిదారులకు నిత్యవసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. సంగం 2వ నెంబరు దుకాణంలో సోమ్లా నాయక్, టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. అదేవిధంగా దివ్యాంగుల ఇంటికి టీడీపీ నాయకులు సరుకులు తీసుకెళ్లి అందచేశారు.

బిట్రగుంట, (దగదర్తి): దగదర్తి మండలం కౌరుగుంటంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్ అధ్వ ర్యంలో ఆదివారం రేషన్‌షాపులో సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి హాజరై లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, ఆర్ఐ శివ, పార్టీ మండల కన్వీనర్ హనుమంత రావు, తదితరులు ఉన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని రేషన్ షాపులో మండల తహసీల్దారు సురేష్‌బాబు ఆదివారం సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నేతలు సుధీర్‌బాబు, అడపా ప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఉలవపాడు రేషన్ షాపులో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

ఉలవపాడు : మండలంలోని ఉలవపాడులోని రేషన్ షాపు నెం. 2 వద్ద లబ్ధిదారులకు తహసీల్దార్ టీ శ్రీనివాసులు బియ్యం, ఇరత సరుకులు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని రేషన్ షాపుల పనితీరును పర్యవేక్షించారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

ఉదయగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడుకు వెళ్లి తిరిగి స్వగ్రామమైన ఉదయగిరికి వస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పీవీ రమణయ్యకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఆది వారం టీడీపీ నాయకులు ఆర్థికసాయం అంద జేశారు. ఈ సందర్భంగా వారు వైద్యశాలకు వెళ్లి ఆయన్ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, ఉప్పుటూరి వెంకటయ్య, రోశయ్య, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం: ఉదయగిరి పట్టణం ఇందిరానగర్‌కాలనీలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన గాలేటి నవ్య కుటుంబానికి కూడా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఫోన్ చేసి పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లిపోగు రాజా, నరసింహా, మట్ల లక్ష్మయ్య, రామయ్య, తుమ్మల కిరణ్ పాల్గొన్నారు.

పొలం యజమాని దారుణ హత్య



మృతుడు నరసింహం బంధువులను విచారిస్తున్న కందుకూరు డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం

లింగసముద్రం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తన స్వంత నిమ్మతోటలో పనిచేయించుకునేందుకు తీసుకెళ్లిన ఓ వ్యక్తి చేతిలో పొలం యజమాని దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలోని ఆర్‌ఆర్ పాలెంలో జరిగింది. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారిపాలెంకు చెందిన తోపూరి నరసింహం (67) శుక్రవా రం ఉదయం 10 గంటలకు ఆర్‌ఆర్ పాలెం సమీపంలోని తన నిమ్మతోటలో పనిచేయించుకునేందుకు పొన్నలూరు మండలంలోని రావులకొల్లు గ్రామానికి చెందిన చలంచర్ల బ్రహ్మయ్య అనే వ్యక్తిని తోట వద్దకు తీసుకెళ్లాడు. అయితే అక్కడకు వెళ్లిన తరువాత ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. అనంతరం ఏమి జరిగిందో ఏమో నరసింహంను బ్రహ్మయ్య కత్తితో తల వెనుక భాగంలో నరికాడు. దీంతో నరసింహం చనిపోయాడు. దీంతో బ్రహ్మయ్య నరసింహం మృతదేహాన్ని బోరు వద్ద ఉన్న పట్టలో కప్పి కందుకూరు వెళ్లిపోయాడు. అయితే కందుకూరులో బ్రహ్మయ్య మద్యం సేవించి అదేరోజు రాత్రి 8గంటలకు నిమ్మతోట వద్దకు వెళ్లి నరసింహం మృతదేహాన్ని కత్తితో ముక్కలు ముక్కలుగా నరికి బోరులో వేసి ఇంటికి వెళ్లిపోయాడు. కాగా, నిమ్మతోటకి వెళ్లిన తండ్రి నరసింహం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రాకపోవడంతో కుమారుడు రమేష్, బంధువులు తోట వద్దకు వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో వారు బ్రహ్మయ్యను నిలదీయగా, తనకు తెలియదని బుకాయించాడు. అయితే అనుమానం వచ్చిన రమేష్ బ్రహ్మయ్యను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి పోలీసులకు అప్పగించి శనివారం ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసుల విచారణలో నిందితుడు బ్రహ్మయ్య చెప్పిన వివరాల మేరకు ఆదివారం కందుకూరు డిఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావు, స్థానిక ఎస్సై ఎం నారాయణలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే పోలీసులు నరసింహం శరీర భాగాలను సేకరించేందుకు బోరును తవ్వించాలని ఎక్స్‌కవేటర్‌ను రప్పించారు. పోలీసు జాగిలం అక్కడ పరిసర ప్రాంతాలను పరిశీలించింది. అయితే బ్రహ్మయ్య నరసింహంను చంపడానికి గల కారణాలు తెలియరాలేదు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం నారాయణ తెలిపారు.

వరికుంటపాడు ఎంపీడీవోగా నాగూర్‌వలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి అధికారిగా, ప్రస్తుతం కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న నాగూర్‌వలికి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. గతంలో ఇన్‌చార్జీ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న ఏవో వేణుగోపాలరావు పదవి విరమణ చేయడంతో ఆయన స్థానంలో నాగూర్‌వలికి బాధ్యతలు అప్పగించారు. సుమారు రెండేళ్లుగా రెగ్యులర్ ఎంపీడీవోను నియమించకపోవడంతో ఇన్‌చార్జీల పాలనే కొనసాగుతోంది.

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీ

● ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ హాస్పటల్ వెనుక రేషన్ దుకాణాన్ని సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయటంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసరాల్లో వయోవృద్ధులు, వికలాంగులకు వారి ఇళ్లవద్దకే వెళ్లి రేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు దుకాణాలలో డీలర్లు అందుబాటులో ఉండి సరుకులు ఇస్తారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టరు శ్రీపూజలను స్థానిక నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ లావణ్య, డీటీ కాటా చెంచురామయ్య, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, రఫీ, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కార్డుదారులకు బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు శ్రీపూజ తదితరులు

అంకమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయంలో జరుగుతున్న అనివేటి మండపం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం ఉదయం ఆయన అంకమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అనివేటి మండప పునర్నిర్మాణం కోసం రూపుదిద్దుకుంటున్న యాలీస్తంభాలను పరిశీలించి శిల్పితో మాట్లాడారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాన్ని కూడా పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈఓ కార్తీక్‌కు సూచించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డీఈ శ్రీనివాసరావు, దామా మల్లేశ్వర రావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, కొడాలి కోటేశ్వరరావు, చిలకపాటి మధు, రావూరి రామకోటయ్య, చక్కా కేశవ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించి పసుపు రైతులను ఆదుకోండి



కల్లాల్లో ఉన్న పసుపు కుప్పలను పరిశీలిస్తున్న వెంకటయ్య

ఉదయగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభు త్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లి, కొత్తపల్లి, లింగంనేనిపల్లి తదితర గ్రామాల్లో కల్లాల్లో ఉన్న పసుపు పంటను పరిశీలించి రైతులతో చర్చించారు. ఆయన మాట్లా డుతూ రేయింబవళ్లు కష్టించి సాగు చేసిన పసుపు పంటకు గిట్టుబాటు ధర లేకపోవ డంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పసుపు పంట కోతల సమయంలో క్వింటా రూ.12 నుంచి రూ.13 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.9 వేలకు దిగజారిందన్నారు. ఎకరా పసుపు పంటకు రూ.2 లక్షల పెట్టుబడి అవుతుందని, ఈ ధరతో రైతులకు పెట్టుబడులు కూడా రావన్నారు. గత ప్రభుత్వంలో క్వింటా రూ.16 వేలు పలికిందన్నారు. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ సంక్షేమమని చెప్పిన కూటమి ప్రభు త్వంలో ధరలు దిగజారడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి పసుపు పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆగ్రో ఇండస్ట్రీస్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలి

● ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

బిట్రగుంట, (దగదర్తి) జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆగ్రో ఇండస్ట్రీస్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంఎల్సీ బీద రవిచంద్ర మాలేపాటిని కోరారు. దగదర్తి మండల టీడీపీ నేత, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదివారం రవిచంద్రను నెల్లూరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం పార్టీకి సంబంధించిన విషయాలను ముచ్చటించుకున్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కావలి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. కావలి మండలం అన్నగారిపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురం రాములవారి తిరునాళ్లలో శనివారం రాత్రి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, భక్తులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను నియమించి పాఠశాలను కాపాడండి

ఉదయగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించి పాఠశాలను కాపాడాలని ఉదయగిరి, సీతారామపురం యూటీఎఫ్ మండల శాఖలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. రెండేళ్ల క్రితం 700 మంది విద్యార్థులతో కళకళలాడుతున్న పాఠశాల ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరత, వసతుల లేమితో మూతపడే స్థాయికి దిగజారిందన్నారు. నూతన భవనాలు నిర్మించినప్పటికీ వాటిని వినియోగంలోకి రాక, విద్యార్థులకు తరగతి గదుల్లేక ఆరుబయట చెట్లకింద విద్యాబోధన చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దీంతో పాటు విద్యార్థులకు మరుగుదొడ్లు, నీటి వసతి లేక, ఉపాధ్యాయుల్లేక ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతోందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించి వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పూజలు

సంగం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో వెలసి ఉన్న నాగారపమ్మ దేవి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించారు. తరువాత భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గుండె పోటుకు గురైన వ్యక్తిని కాపాడిన సీఐ

కావలి రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ ముసునూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన చంద్రశేఖర్ మోటార్‌సైకిల్‌పై వెళ్తూ ఆదివారం సాయంత్రం గుండెపోటుకు గురై ట్రంక్ రోడ్డు లోని లేక్ వ్యూ హోటల్ సమీపంలో కుప్పకూలిపోయాడు. విధుల నిమిత్తం అటుగా వెళ్తున్న 1వ పట్టణ సీఐ ఫిరోజ్ గుర్తించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న చంద్రశేఖర్‌కు సీపీఆర్ చేసి తన డ్రైవర్ శివ, స్థానికుల సహకారంతో ఆటోలో ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అతని ఆరోగ్యం కుదుట పడటంతో సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన సీఐ ఫిరోజ్‌కు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడు బాధ్యతల స్వీకరణ

సీతారామపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :ఇందుకూరు పేట నుంచి ప్రమోషన్ ద్వారా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ప్రవీణ , దర్గామిట్ట నెల్లూరు నుంచి ఓగురువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా గిరి ప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీసీ వెంగయ్య, సిగే కొండయ్య, విజయబాబు, వెంకటేశ్వర్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుత్తలూరు, నందిపాడు, ఏరుకొల్లు, నర్రవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా కె.రమణమ్మ, దేవకుమార్, మాధవి, అంజయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

యోగాంధ్రపై అవగాహన

అనంతసాగరం జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): స్థానికశాఖ గ్రంథాలయంలో ఆది వారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా యోగాంధ్ర కార్యక్రమంపై గ్రంధపాలకుడు నారాయణ రావు అవగాహన కల్పించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

నేకునాంపేట హెచ్‌ఎంగా రమణ

కొండాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వివి రమణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.